జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 12 సంచిక 94 విశాఖపట్నం శనివారం 19 డిసెంబర్ 2020 8 పేజీలు వెల : 5.00

## ఆ చట్టాలను రాత్రికి రాత్రే రూపొందించలేదు

### రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రధాని మోడీ మండిపాటు



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** కేంద్రం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలంటూ రైతులు ఆందోళన చేస్తున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ మధ్యప్రదేశ్ రైతులతో మాట్లాడారు. చట్టాలను రాత్రికి రాత్రే తీసుకురా లేదని, వాటిని రూపొందించేందుకు దశాబ్దాలుగా చర్చలు, సంప్రదింపులు జరిగాయని పేర్కొన్నారు. రైతు సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం మధ్యప్రదేశ్ రైతులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్టాలకోసం రైతులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారని, రాజకీయ పార్టీల గత మేనిఫెస్టోలను చూస్తే ఈ వాగ్దానాలే కనిపిస్తాయని పేర్కొన్నారు. నూతన వ్యవసాయ చట్టాలపై ప్రతిపక్షాలకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, కావాలనే రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. 'ప్రస్తుత వ్యవసాయ చట్టాలతో ప్రతిపక్షాలకు ఎలాంటి అభ్యంతరం లేదు. వారికున్న సమస్యల్లా.. వారు వాగ్దానం చేసి అమలు చేయలేకపోయిన చట్టా లను మోదీ చేసి చూపించడమే. అన్ని పార్టీలకు చేతులెత్తి నమస్క రిస్తా. రైతులకున్న భయాలను తొలగించండి' అని పేర్కొ న్నారు. కాంగ్రెస్ చేసినవన్నీ బూటకపు వాగ్దానాలేనని మోదీ మండిపడ్డారు. 'వారు అధికారంలో ఉన్నప్పుడు స్వామినాథన్ కమిషన్ నివేదికను ఖండించారు. మేము ఆ నివేదికను పునఃపరిశీలించి సిఫారసులను మిగతా 2లో..

## చంద్రబాబు కుట్రలోంచి బయటకి రావాలి

### చంద్రబాబుకి మేనేజ్ చేయడం పుట్టుకతో వచ్చిన విద్య

మంత్రి కొడాలి నాని



**గుంటూరు, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** పేదలకి ఇళ్లస్థలాలు ఇవ్వ కూడదని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని, ఆ కుట్రలోంచి అమరావతి రైతులు బయటకి రావాలని మంత్రి కొడాలి నాని అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో 70 రోజులకి పైగా ఇళ్ల స్థలాల కోసం దళితులు దీక్షలు చేస్తుంటే చంద్రబాబు విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. మందడం దీక్ష శిబిరంలో పాల్గొన్న మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ..'మీరు అమరావతి ఉద్యమం పేరుతో పెయిడ్ ఆర్టిస్టులని తీసుకొచ్చినట్లు ఇక్కడెవరూ పెయిడ్ ఆర్టిస్టులు లేరు. మీరు...మీ తోకపార్టీలు పెయిడ్ ఆర్టిస్ట్ లంటూ మిగతా 2లో..

## సీఎస్ నీలం సాహ్నిని సత్కరించిన సీఎం జగన్



**అమరావతి, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నీలం సాహ్ని ఈనెల అఖరికి తన పదవికి విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో సీఎస్ సాహ్నిని శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. కేబినెట్ సమావేశంలో సీఎం జగన్‌తోపాటు మంత్రి మండలి సభ్యులు ఆమెను సత్కరించారు. కాగా 2019 నవంబర్ 14న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీలం సాహ్ని పదవి బాధ్యతలు చేపట్టారు. విభజన తర్వాత ఏపీ తొలి మహిళా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఆమె నియమితులయ్యారు. సాహ్ని 2018 నుంచి ఇప్పటివరకూ కేంద్రసామాజికన్యాయం, సాధికారితశాఖ కార్యదర్శిగా వ్యవహరించారు.

### ముగిసిన ఏపీ కేబినెట్ భేటీ

1984వ ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన నీలం సాహ్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో.. మచిలీపట్నంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్‌గా, నల్గొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. మున్సిపల్ పరిపాలన విభాగం డిప్యూటీ సెక్రటరీగా, స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీగా బాధ్యతలు నిర్వర్తించారు. నిజామాబాద్, ఖమ్మం జిల్లాల్లోనూ పని చేసిన సాహ్ని.. నల్గొండ జిల్లా కలెక్టర్‌గా, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్‌గా విధులు చేపట్టారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శిగా పని చేశాక.. ఎపీఐడీసీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీగా ఉమ్మడి రాష్ట్రంలో పని చేశారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. 2018 నుంచి ఇటీవలి వరకు కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత కార్యదర్శిగా పనిచేశారు.

## చెరకు ఉత్పత్తిపై ప్రత్యేక కార్యాచరణ

### చెరకు కర్మాగారాల సమస్యలపై చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం




**అమరావతి, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** చెరకు కర్మాగారాల సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ అయ్యింది. విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు బొత్స, మేకపాటి, కన్నబాబు పాల్గొన్నారు. షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణకోసం చేపట్టవలసిన చర్యలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఉత్తరాంధ్రలో చెరకు ఉత్పత్తి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి సూచించారు. చక్కెర కర్మాగారాల సమస్యలు ఆర్థిక, పౌరసరఫరాల శాఖతో కూడా ముడిపడి ఉన్నందున మరో సమావేశం ఏర్పాటు చేయాలని, తరువాత సమావేశానికి ఆయా శాఖల కార్యదర్శులను కూడా పిలవాలని ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్యకు మంత్రి మేకపాటి సూచించారు. పర్మినెంట్, సీజనల్ ఉద్యోగుల సంఖ్య, వారి జీతాల గురించి మంత్రి బొత్స సత్యనారాయణ అడిగి తెలుసుకున్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కొవ్వూరు సహకార చక్కెర కర్మాగారం గురించి మంత్రి మేకపాటి వివరించారు. స్థానిక చెరకు రైతుల అవసరమైన వ్యవసాయ ఆధారిత ఆహార శుద్ధి యూనిట్ల ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నామని, మిగతా 2లో..

**సాధారణ రైళ్లు ఎప్పుడో.. ఇప్పుడే చెప్పలేం..**
వివరాలు 2లో..

## మాజీ ఎంపీ రాయపాటి ఇంట్లో సీబీఐ రైడ్



**గుంటూరు, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివ రావు ఇంట్లో సీబీఐ సోదాలు నిర్వహిస్తోంది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే రాయపాటి ఇంట్లో సీబీఐ తనిఖీలు కొనసాగుతున్నాయి. ట్రాన్స్ ట్రాయ్ కంపెనీకి సంబంధించిన పలు రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి రాయపాటి కుటుంబ సభ్యుల్ని కూడా విచారిస్తున్నట్లు సమాచారం.






## దావాగ్నిలా వ్యాపిస్తోన్న కోవిడ్: సుప్రీం



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** కరోనా నియంత్రణ మార్గదర్శకాల అమల్లో లోపాల కారణంగా దేశంలో కొవిడ్ దావాగ్నిలా వ్యాపిస్తోందని సర్వోన్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. కరోనా మార్గదర్శకాలపై దాఖలైన పలు పిటిషన్ల విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కొవిడ్ 19పై ప్రపంచ యుద్ధం జరుగుతోందని, ఈ మహమ్మారి కారణంగా ప్రపంచంలో ప్రతి ఒక్కరూ బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేసింది. కరోనా మార్గదర్శకాలపై దాఖలైన పిటిషన్లపై జస్టిస్ అశోక్ భూషణ్ నేతృత్వంలోని ధర్మాసనం నేడు విచారణ జరిపింది. కేంద్రం తీసుకొచ్చిన మార్గదర్శకాలు, స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్లు సరిగ్గా అమలవడం లేదని, అందువల్ల దేశంలో కరోనా దావాగ్నిలా వ్యాపిస్తోందని పేర్కొంది. ఈ సందర్భంగా మిగతా 2లో..

## తిరుపతి సీటు గెలిస్తే ఏపీలో బీజేపీదే అధికారం: టీజీ జోస్యం



**కర్నూలు, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** ప్రధాని మోదీని బీజేపీ రాజ్య సభ ఎంపీ టీజీ వెంకటేష్ ప్రశంసలతో ముంచెత్తారు. ప్రధాని మోదీ ఒక బహుబలి అంటూ కీర్తించారు. ప్రపంచంలోనే క్రమశిక్షణ కలిగిన పార్టీ బీజేపీ అని కొనియాడారు. రాజధానిని ఫ్రీ జోన్ చేస్తేనే ఉద్యోగాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాన్ని 3 ముక్కలు చేస్తే రాయలసీమ వాసులు మిగతా 2లో..

## వైఎస్సార్ జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

### తుపాన్ నష్టంపై కేంద్ర బృందానికి నివేదిక అందజేసిన ఎంపీ అవినాష్‌రెడ్డి



**వైఎస్సార్ జిల్లా, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** నివర్ తుపాను నష్టాన్ని జిల్లాలో కేంద్రం బృందం శుక్రవారం పరిశీలించింది. తుపాను నష్టంపై కేంద్ర బృందానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నివేదిక అందించారు. పూర్తి అంచనా వేసి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని మిగతా 2లో..

## చంద్రబాబు కుట్రలోంచి బయటకి రావాలి

(మొదటిపేజీ తరువాయి)

తప్పుడు ప్రచారం చేయాలని చూస్తున్నారు' అని దుయ్యబట్టారు. అమరావతి కుంభకోణంపై సీఐడీ విచారణ జరిగితే చంద్రబాబు అక్రమాలు బయటపడతాయని, అందుకే ఆయన అమరావతి రైతులని మభ్యపెట్టి ఉద్యమాల పేరుతో హడావిడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబుకి మేనేజ్ చేయడం పుట్టుకతో వచ్చిన విద్య అని పేర్కొన్న మంత్రి..చంద్రబాబు బినామీలు, బినామీ ఆస్తులు అమరావతిలోనే ఉన్నాయని తెలిపారు. అమరావతి ప్రాంతంలో 9 రాజధానులు కట్టడానికి గతంలో చంద్రబాబు ప్లాన్ చేసి..ఇక్కడ పేదలు నివాసం ఉండకూడదని భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఏ ప్రాంతంలో లేని ఇబ్బందులు ఈ అమరావతిలోనే ఎందుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ప్రశ్నిం చారు. 'అమరావతిలో రాజధాని తీసేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎక్కడా చెప్పలేదు. ఈ ప్రాంతంలో సెక్రటేరియట్... హైకోర్టు మాత్రమే ఉండవు. మిగి లిన అన్ని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు యధావిధిగా ఉంటాయి. కార్యనిర్వహక రాజధాని ఉత్తరాంధ్రలో ఉంటే తప్పేంటి? సిట్ అమరావతి కుంభకోణంపై కేసు నమోదు చేస్తే రాత్రికి రాత్రి చంద్రబాబు గ్యాగ్ ఆర్డర్ తీసుకొచ్చాడు. ఇలాంటి ఆర్డర్ చంద్రబాబు తప్పితే ప్రధాని కూడా తీసుకురాలేరు. 2 వేల కోట్లతో ఈ ప్రాంతంలో జాతీయ రహదారులని అభివృద్ధి చేయనున్నారు. మూడు రాజధానులు పెట్టి తీరతాం...విశాఖలో కార్యనిర్వాక రాజధాని...అమరావతిలో శాసన సభ...కర్నూలులో హైకోర్టు పెట్టి తీరతాం. సిఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకి ఇళ్ల స్థలాలు ఇవ్వబోతున్నారు' అని కొడాలి నాని తెలిపారు.

## వైఎస్సార్ జిల్లాలో కేంద్ర బృందం పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

ఆయన కోరారు. వ్యవసాయం, ఉద్యానవన, మౌలిక రంగాల్లో భారీ నష్టం వాటిల్లిందని కేంద్ర బృందం దృష్టికి ఆయన తీసుకెళ్లారు. వరి, వేరుశనగ సహా అన్ని పంటలూ దెబ్బతిన్నాయని వివరించారు. బాధితులకు న్యాయం చేయాలని కేంద్రబృందానికి అవినాష్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## తిరుపతి సీటు గెలిస్తే ఏపీలో బీజేపీదే అధికారం: టీజీ జోస్యం

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ వెళ్లడం కష్టమన్నారు. సీమలో మినీ సెక్ర టేరియట్ ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమ అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని చెప్పుకొచ్చారు. జగన్.. కేసీఆర్‌తో లాలూచీ పడ కుండా ప్రాజెక్టులపై ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తిరుపతి పార్ల మెంట్ సీటు గెలిస్తే ఏపీలో బీజేపీదే అధికారమని టీజీ వెంకటేష్ జోస్యం చెప్పారు.

## దావాగ్నిలా వ్యాపిస్తోన్న కోవిడ్: సుప్రీం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయస్థానం పలు సూచనలు చేసింది. కరోనా పరిస్థితుల దృష్ట్యా ఆయా ప్రాంతాల్లో లాక్‌డౌన్ లేదా కర్ఫ్యూ విధించాలనుకుంటే ఆ నిర్ణయంపై చాలా రోజులు ముందుగానే ప్రకటన చేయాలని సూచించింది. దాంతో ప్రజలు అందుకు అనుగుణంగా సిద్ధమవుతారని తెలిపింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రతి రాష్ట్రం అప్రమత్తంగా వ్యవహరించాలని, కేంద్రంతో కలిసి పనిచేయాలని సూచించింది. ప్రజల ఆరోగ్యం, రక్షణకే ప్రథమ ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. అంతేగాక, కరోనా దృష్ట్యా గత ఎనిమిది నెలలుగా వైద్యులు, నర్సులు విరామం లేకుండా పనిచేస్తుండటంతో శారీరకంగా, మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారని కోర్టు పేర్కొంది. వారికి తగినంత విశ్రాంతి కల్పించాల్సిన అవసరం ఉందని ధర్మాసనం సూచించింది.

## చెరకు ఉత్పత్తిపై ప్రత్యేక కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

జపాన్ సంస్థలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చారని సహచర మంత్రులకు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి తెలిపారు. వచ్చే సీజన్‌లో ఫ్యాక్టరీల పునరుద్ధర ణకు ఇప్పుడే కార్యాచరణ ప్రారం భించాలని వ్యవసాయ శాఖ మంత్రి కన్నబాబు సూచించారు. 6 చక్కెర కర్మాగారాలకు కేటాయించిన భూ ములు, వాటి విలువపై మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. పనిచేయని షుగర్ ఫ్యాక్టరీల గత బకాయిలు, విడుదల చేసిన నిధుల వినియోగంపై మంత్రులు ఆరా తీశారు. చిత్తూరు, నెల్లూరు, కడప, విశాఖలోని చక్కెర ఫ్యాక్టరీల ఆర్థిక పరిస్థితి, యంత్రాల స్థితిపై మంత్రులు వాకబు చేశారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు చక్కెర అవసరాలు, కొనుగోలు వివరాలపైనా చర్చ జరిగింది. తమిళనాడు రాష్ట్రంలో కర్మాగారాల్లో ఉత్పత్తి అయ్యే చక్కెరను స్థానిక పౌరసరఫరాల శాఖకు పంపిణీ చేసే పద్ధతి గురించి షుగర్, కేన్ కమిషనర్ వెంకట్రావు ప్రస్తావించారు. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, షుగర్స్ డైరెక్టర్ వెంకట్రావ్ , చక్కెర కర్మాగారాల ప్రతినిధులు హాజరయ్యారు.

## ఆ చట్టాలను రాత్రికి రాత్రే రూపొందించలేదు

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేశాం. మధ్యప్రదేశ్ రైతు లకు కాంగ్రెస్ తప్పుడు వాగ్దానాల గురించి బాగా తెలుసు. రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీలను మధ్యప్రదేశ్ రైతులు మరిచిపోలేదు' అని ప్రధాని ఆ సమావేశంలో పేర్కొన్నారు. వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలనే డిమాండ్‌తో పలు రాష్ట్రాల రైతులు దిల్లీ శివార్లలో ఉద్యమం చేస్తున్నారు. చలికి, ఆకలికి తట్టుకొని వారు చేస్తున్న ఉద్యమం నేటితో 23వ రోజుకు చేరుకుంది. వారి నిరసనలకు అనేకమంది మద్దతు తెలుపుతున్నారు. పలుమార్లు ప్రభుత్వంతో చర్చలు జరిగినా సఫలం కాలేదు. చట్టాల్లో మార్పులు చేస్తామని కేంద్రం పేర్కొం టుండగా, చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉర్దూ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**బైరెడ్డిపల్లి, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** స్థానిక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాల సందర్శించిన జడ్పీ సీఈఓ పి ప్రభాకర్ రెడ్డి పాఠశాల నందు కోవిడ్ నిబంధనలు, శానిటైజేషన్ అమలు చేస్తున్న విషయంపై పరిశీలించారు. జడ్పీ హైస్కూల్ నందు ప్రతి తరగతి గదిని పరిశీలించారు. స్థానిక హెడ్ మాస్టర్ ను కోవిడ్ నిబంధనలు ఖచ్చితంగా అమలు పరచి, శానిటైజేషన్ తరచూ చేసి, విద్యార్థుల ను కోవిడ్ బారి నుండి కాపాడవలయునని ఆదేశించారు.

# ఏఐవైఎఫ్ ఢిల్లీలో జరుగుతున్న రైతుల దీక్షకు మద్దతు

**నరసరావుపేట. ప్రజాపాలన :** స్థానిక నరసరావుపేటలో అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఢిల్లీలో రైతుల దీక్షకు మద్దతుగా ఏఐవైఎఫ్ రాష్ట్ర పిలుపులో భాగంగా రైతులు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ నూతన చట్టాలను 3 రద్దు చేయాలని దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమంలో దీక్షలో రాస్తారోకోలు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు పలు దఫాలుగా నిరసనలో వ్యక్తం చేస్తున్న నరేంద్ర మోడీ గారు రైతులను చిన్న చూపు చూస్తూ ఉన్నాడు ఒక పక్క దేశానికి వెన్నుముక్క రైతు అని





చెప్పి మరోపక్క కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే నల్ల చట్టాలని రద్దు చేయాలని ఏఐవైఎఫ్ గా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ కార్యదర్శి జి హర్ష ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి మేకల సంపత్ ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వైదన వెంకట్ ఏఐవైఎఫ్ నాయకులు మాజీ కుమారు శివ సుబ్బారావు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

## సాధారణ రైళ్లు ఎప్పుడో..ఇప్పుడే చెప్పలేం..

### రైల్వే బోర్డు ఛైర్మన్ వీకే యాదవ్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18 (ప్రజా పాలన) :** కొవిడ్ కారణంగా నిలిచిపోయిన సాధారణ రైలు సేవల ప్రారంభ తేదీ ఎప్పుడనేది కచ్చితంగా చెప్పలేమని రైల్వే బోర్డు ఛైర్మన్ వీకే యాదవ్ తెలిపారు. ఇంకా సాధారణ పరిస్థితులు నెలకొనలేదని చెప్పారు. ఈ మేరకు దిల్లీలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొవిడ్ కారణంగా నిలిచిపోయిన సాధారణ రైళ్లస్థానంలో ప్రస్తుతం 1,089 ప్రత్యేక రైళ్లు నడుస్తున్నాయని వీకే యాదవ్ అన్నారు.

సాధారణ రైళ్లు మాత్రం ఎప్పుడు ప్రారంభించేది కచ్చితంగా చెప్పలేమన్నారు. ఇప్పటికే జనరల్ మేనేజర్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నారని, పరిస్థితులు అనుకూలంగా ఉంటే సర్వీసులు ప్రారంభిస్తామని తెలిపారు. రైల్వే ఉన్నతాధికారులు సైతం ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షిస్తున్నారన్నారు. సేవలను నెమ్మదిగా దశలవారీగా ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు ప్యాసింజర్ రైళ్ల ద్వారా రూ. 4,600 కోట్ల ఆదాయం సమకూరిందని యాదవ్ తెలిపారు. అది 2021 మార్చి నాటికి రూ. 15వేల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ప్రయాణికుల విభాగంలో గతేడాది రూ. 53వేల కోట్లు ఆదాయం వచ్చిందని, గతంతో పోలిస్తే 87 శాతం తక్కువగా ఉందని చెప్పారు. ప్యాసింజర్ విభాగంలో వచ్చిన నష్టాలను సరకు రవాణాతో భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే సరకు రవాణా విభాగం అనుకున్న లక్ష్యాన్ని 97 శాతం చేరుకుందని చెప్పారు. ప్రస్తుతం ప్రయాణికుల రైళ్లలో సరాసరి 30 నుంచి 40 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ ఉంటోందన్నారు.

## విశాఖను కమ్మిన మంచు దుప్పటి



**బుచ్చయ్య పేట (విశాఖ), డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** విశాఖ లోని గ్రామాలలో పొగ మంచు కనువిందు చేస్తోంది. దట్టమైన మంచు దుప్పటి మరుగున విశాఖ రహదారులన్నీ దోబూచులాడుతున్నట్టున్నాయి. తెల్లవారుజామున మార్నింగ్ వాక్ చేసేవారైతే ప్రకృతిని కమ్మిన మంచు అందాలను ఉత్సాహంగా ఆస్వాదిస్తున్నారు. గత పది రోజులుగా మండలంలో ఉన్న బంగారుమెట్ట చిన్నఅప్పన్నపాలెం, దిబిడి, బుచ్చయ్య పేట కందిపూడి, రాజాం, తదితర గ్రామాల్లో పొగమంచు కనువిందు చేస్తుంది. మరోవైపు.. మంచు కప్పిన రహదారులలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోలాగా మైదాన ప్రాంతంలో సైతం కొద్ది రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తుంది. తెల్లవారుజామున 5 గంటల నుండి 7 గంటల వరకు పొగమంచు విపరీతంగా కురుస్తోంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకుని వాహనాలను నడిపే పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక కష్టంతో వాహనాలను నడుపుతున్నారు.

## దిశ, నిర్భయ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రకాశం (ఇడుపులపాడు), డిసెంబర్ ప్రజాపాలన :** విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల ఇడుపులపాడు నందు మహిళా మార్చ్ వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దిశ, నిర్భయ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళా మార్చ్ 'వంద రోజుల మహిళా మార్చ్ బ్రోచర్', 'నవరత్నాలు, ప్రభుత్వ పథకాల అమలు, దశలవారీ మద్యపాన నిషేధం, దిశ యాప్, ఇతర చట్టాలు, హెల్ప్‌లైన్ నంబర్లపై మార్చి 8 వరకు వంద రోజుల కార్యాచరణ' నిర్వహించనున్నారు. అని తెలియజేశారు.

ఈ వంద రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని పాఠశాలలు,





కళాశాలల్లో విద్యార్థులకు రక్షణ టీంలు, సైబర్ నేరాలపై, అవగాహన సదస్సులు నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులు శిరీష, సుకన్య దిశ, నిర్భయ చట్టాలపై వివరించారు. సచివాలయం విద్యా సహాయకులు రత్న శేఖర్, వీరాంజనేయులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో కష్టపడి మంచి అలవాట్లు నేర్చుకోవాలని, ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఆరోగ్య ఎంయన్‌యం నాగరాజ కుమారి, పాఠశాల సిబ్బంది పర్వతనేని పావని, భవనం శివలీల, బండారు అనిల్ కుమార్, పెంట్యాల పావని, అంబటి సురేష్, వసంత రఘు బాబు, పెండ్యాల రాధిక, గోపిదేశి ఆదినారాయణ, గోరంట్ల సంధ్యారాణి, కంబాలపాటి నర్సయ్య పాల్గొన్నారు.

## మహిళా సాధికారిత లక్ష్యంగా ముఖ్యమంత్రి

### ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ

**రామచంద్రాపురం, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** మహిళ చేతిలో డబ్బు, అధికారం వుంటే మహిళా సాధికారిత సాధించగలరనే అభిప్రాయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి



పథకాలను మహిళలకే ప్రాధాన్యతనిస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్న ఆర్‌సి పురం మండలం, సి. రామాపురం గ్రామంలో చైర్ పర్సన్‌కు చిత్తూరు ఆర్డీఓ రేణుక, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, స్థానిక నాయకులు, మహిళలు ఘన స్వాగతం పలుకగా ధర్మరాజుల గుడి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. గుడి వద్ద ఏర్పాటు చేసిన మహిళా మార్చ్ 100 రోజుల కార్యక్రమంలో చైర్ పర్సన్ ముఖ్య అతిథిగా పాల్గొనగా మండల అభివృద్ధి అధికారి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షత వహించగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించి బాలల అన్నప్రాసన కార్యక్రమం, గర్భిణీల శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని, అనంతరం జ్యోతిని వెలిగించి మహిళామణులతో ముఖాముఖీ కార్యక్రమం సాగించారు. జగనన్న తోడు లబ్దిదారులకు రూ. 49.90 వేల చెక్కును చైర్ పర్సన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రాజశేఖర్ రెడ్డి , తహశీల్దార్ మధుసూధన రావు, డైరెక్టర్ సూయజ్, పి డి ఉమా మహేశ్వరి పాల్గొన్నారు.

# విశాఖపై కమలం కన్ను

**విశాఖపట్టణం, డిసెంబర్ 18, (ప్రజాపాలన) :** బీజేపీ అన్ని రాజకీయ పార్టీల కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివినట్లుంది. హామీలు కూడా కోటలు దాటేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు జరిగి గట్టిగా ఏడాదిన్నర కాలేదు వచ్చే ఎన్నికల కోసం టికెట్ కౌంటర్ ని బీజేపీ ఓపెన్ చేసేసింది అని ప్రచారం అయితే గట్టిగా సాగుతోంది. హాట్ ఫేవరేట్ సీట్లను ముందుచి మరీ బడా నేతలకు గేలం వేస్తోంది. ఇక ఒకే సీటు విషయంలో ఇద్దరు ముగ్గురు నేతలకు బీజేపీ నుంచి హామీలు వెళ్తూండడం ఆ పార్టీ అమలు చేస్తున్న ముదురు రాజకీయంగా ఉంది.విశాఖ నుంచి గత ఏడాది జరిగిన ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసి రెండున్నర లక్షలకు పైగా ఓట్లను తెచ్చుకున్న మాజీ సీబీఐ అధికారి జేడీ లక్ష్మీనారాయణ వచ్చే ఎన్నికల్లోనూ విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేద్దామనుకుంటున్నారు. ఆయనను బీజేపీలోకి తెచ్చి పోటీ చేయిస్తే గెలుపు గ్యారంటీ అని ఆ పార్టీ భావిస్తోంది అని ఓ వైపు వినిపిస్తున్న మాట. ఆయన కూడా అందుకు సుముఖంగా ఉన్నారని అంటున్నారు. ఇపుడు సడెన్ గా ఈ సీటు విషయంలో మరో పేరు బీజేపీ నుంచే వినిపిస్తోందిట.వచ్చే ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేయడానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాస్ ని బీజేపీ రెడీ చేస్తోందని ఇంకో వైపు నుంచి వినిపిస్తున్న మాట. విశాఖ పార్లమెంట్ పరిధిలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాపులకు మంచి బలం ఉంది. అందువల్ల ఆ సామాజికవర్గం బలం, గంటావ్యక్తిగత ఇమేజ్, బీజేపీకి ఉన్న పట్టు ఇవన్నీ కలిస్తే విశాఖ లోక్ సభ సీటుని బంపర్ మెజారిటీతో కొడతామని కమలనాథులు భావిస్తున్నారుట. అందుకోసం గంటాను ఇప్పటినుంచే దువ్వుతున్నారని టాక్.ఇక ఈ మధ్యనే బీజేపీ జాతీయ కార్యవర్గంలోకి తీసుకున్న కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధేశ్వరి కన్ను కూడా విశాఖ మీదనే ఉంది. ఆమె 2009 ఎన్నికల్లో ఇక్కడ నుంచే గెలిచి కేంద్ర మంత్రి అయ్యారు. 2019 ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓడినా కూడా 2024 నాటికి తనకు సేఫెస్ట్ సీటు ఇదేనని ఆమె భావిస్తున్నారు. పార్టీలోని ఒక వర్గం కూడా పురంధేశ్వరి విశాఖ నుంచి బరిలో ఉంటారని చెబుతోంది. ఇక ఆమె సామాజిక వరం పలుకుబడి గట్టిగా ఉంది. రాజకీయంగా ఎక్కువ సార్లు కమ్మలు గెలుచుకున్న సీటు ఇది. దాంతో ఈ సీటు వదులుకోరాదని బీజేపీలోని ఆ వర్గం కూడా భావిస్తోందిట. మొత్తానికి బీజేపీ ఇలా హాట్ ఫేవరేట్ సీట్లను చూపించి నేతలకు గేలం వేయడంతో కాషాయ రాజకీయాలలో కొత్త కలకలం రేగుతోంది.

## వ్యర్థాలపై వ్యతిరేక యుద్ధం చేయాలి: ఎంపిడివో

**వేటపాలెం, ప్రజాపాలన:** వ్యర్థాలపై వ్యతిరేక యుద్ధ పోరాటం చేయాలని అలాగే ప్రజలందరిలో అవగాహన కల్పించాలని మండల అభివృద్ధి అధికారి కె నేతాజీ అన్నారు. శుక్రవారం మండల కార్యాలయ పరిధి లోని రామన్నపేట 1 పంచాయతీ లో పారిశుధ్య కార్మికులకు మనం మన పరిశుభ్రత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు శ్రద్ధ వహించి పని చేయాలన్నారు. అలగే ప్రజలందరూ తడిచెత్త పొడిచెత్తలను డస్ట్ బిన్ ద్వారా వేరుగా ఉంచాలని వ్యర్థాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశంలో కార్మికులకు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి బెల్లంకొండ ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వాలింటీర్లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలకు బ్యాంకులు 24లోగా లబ్దిదారులకు రుణాలు అందించాలి



### వైఎస్ఆర్ బీమా పథకం క్రింద జిల్లాలో 9 లక్షల 56 వేల కుటుంబాలకు బీమా సౌకర్యం
### జగనన్నతోడు పథకం క్రింద 36 వేల మందికి బ్యాంకుల ద్వారా రుణసౌకర్యం
### అర్హులైన ప్రతి లబ్దిదారునికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తాం
### -జిల్లా కలెక్టరు ఏ.యండి . ఇంతియాజ్

**విజయవాడ, ప్రజాపాలన :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందాలని ఈదిశగా ఈ నెల 24 వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు ఏ.యండీ. ఇంతియాజ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్స్, సంక్షేమ శాఖల అధికారులతో జిల్లాలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును జిల్లా కలెక్టరు ఏ.యండి . ఇంతియాజ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు ఇంతియాజ్ మాట్లాడుతూ నవరత్నాల అమల్లో భాగంగా అర్హులైన ప్రతి లబ్దిదారునికీ సంక్షేమ పథకాలను అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ . జగన్మోహన రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తీసుకువచ్చారని కలెక్టరు అన్నారు . వాలంటీర్ల ద్వారా అర్హత ఉన్న ప్రతి లబ్దిదారునికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని , ఇంటి వద్దకే లబ్దిదారునికి ప్రభుత్వ సహాయం అందేలా జిల్లాలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పనిచేస్తున్నారని కలెక్టరు అన్నారు. జగనన్నతోడు కార్యక్రమం ద్వారా జిల్లాలో 36 వేల మందికి ఋణసౌకర్యం కల్పించాలనే లక్ష్యం కాగా , ఇంతవరకూ 6 వేలమందికి ఋణాలు అందించామని కలెక్టరు అన్నారు . పియం స్వస్వనిధి పథకం క్రింద 18 వేలమందికి ఋణసౌకర్యం కల్పించాలని లక్ష్యంకాగా ఇంతవరకూ 4 వేలమంది లబ్దిదారులకు ఋణసౌకర్యం అందించామని, వైయస్ఆర్ చేయూత కార్యక్రమం ద్వారా 2557 మందికి రుణ సౌకర్యం కల్పించాలని లక్ష్యంకాగా, ఇంతవరకూ 1810 మంది లబ్దిదారులకు రుణసౌకర్యం కల్పించామని కలెక్టరు అన్నారు . ప్రతి కుటుంబం లోనూ సంపాదించే వ్యక్తికి వైయస్ ఆర్ బీమా పథకం ద్వారా ఇన్సూరెన్స్ అందిస్తున్నామని , ఇందుకు సంబంధించి జిల్లాలో 9 లక్షల 56 వేల రేషన్ కార్డులు ఉండగా వాటిలో 1 లక్షా 60 వేల రేషన్ కార్డులకు సంబంధించి ఆ కుటుంబ యజమానికి వై.యస్. ఆర్ బీమా పథకం అమలు చేసామని కలెక్టరు అన్నారు . వై.యస్. ఆర్ . బీమా పథకం క్రింద ఇన్సూరెన్స్ కంపెనీలకు లబ్ధిదారుడు చెల్లించవలసిన ప్రీమియం వాటాను ప్రభుత్వమే ఆయా బ్యాంకులకు జమచేసిందని కలెక్టరు అన్నారు . ఇందుకు సంబంధించి జిల్లాలో 9 లక్షల 56 వేల రేషన్ కార్డులకు సంబంధించిన కుటుంబ యజమానులకు వారి బ్యాంకు అకౌంట్ ద్వారా ఇన్సూరెన్స్ ఎ మౌంట్ జమ చేసేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని , ఇంతవరకు 1 లక్షా 60 వేలమందికి మాత్రమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించారని కలెక్టరు అన్నారు . సంక్షేమ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు నిర్దేశించిన లక్ష్యాలను ఈ నెల 24 వ తేదీలోగా ఎంపిక చేసిన లబ్దిదారులకు రుణ సౌకర్యం కల్పించాలని ఇందుకు సంబంధించి సంక్షేమ శాఖల అధి కారులు , బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టరు ఏ.యండి . ఇంతియాజ్ అన్నారు . పేదకుటుంబాల జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమప ధకాలకు బ్యాంకర్లు సకాలంలో ఆర్థిక సహాయం అందించి వారికి తోడ్పాటు అందించాలని ఈదిశగా ఈ నెల 24 వ తేదీలోగా ఆయా బ్యాంకు శాఖలకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు ఏ.యండి. ఇంతియాజ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు . ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టరు ( సంక్షేమం) కె.మోహన్ కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు, లీడ్ బ్యాంకు మేనేజరు కె.రామ్మోహనరావు , పివో యుసిడి అరుణ , మెప్మా పిడి ప్రకాష్ రావు , వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతాంగ పోరాటానికి మద్దతుగా దళిత ప్రజా సంఘాల నాయకుల ధర్నా



**చీరాల (ఒంగోలు) :** కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన 3 రైతు వ్యతిరేక చట్టాలను వ్యతిరేకిస్తూ, ఢిల్లీలో జరుగుతున్న రైతాంగ పోరాటానికి మద్దతు ఇస్తూ బీసీ ఫెడరేషన్, రైతు సంఘాలు, వామ పక్ష పార్టీ, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముంత వారి సెంటర్ లోని రిలయన్స్ డిజిటల్ వద్ద ధర్నా వామపక్ష, ప్రజా సంఘాల నాయకులునిర్వహించిన. అంబానీ ఆధానిల కోసం నూతనంగా కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలు చేయాల్సి వచ్చిందని అన్నారు. ఢిల్లీ రైతుల పోరాటం లో 22 మంది రైతులు, అమరులైన కేంద్రంలో ఎలాంటి స్పందన లేకపోవటం దారుణం అన్నారు. ప్రజలందరూ రిలయన్స్ వస్తువులను బహిష్కించి ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. తక్షణమైన మోడీ ప్రభుత్వం తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామ పక్ష నాయకులు ఎన్ బాబురావు, యం వసంతరావు, డి.నాగేశ్వరావు, యల్ జయరాజు, గంగయ్య, రమణ, ఎ బాబురావు, సామ్యేల్, ప్రజా సంఘాల నాయకులు ఊటుకూరు వెంకటేశ్వర్లు, మోహన్ కుమార్ ధర్మ, బీరక పరమేష్, కర్ణ హనుమంతురావు, గోశాల ఆశీర్వాదం, పుల్లయ్య, దుడ్డు విజయ్ చందర్, అమిత్, పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శాశ్వత భూహక్కు , భూ రక్షపై రైతులకు అవగాహన: తహసీల్దారు



**వేటపాలెం, ప్రజాపాలన:** భూ సమస్యల పరిష్కారం కోసమే శాశ్వత భూహక్కు, భూ రక్ష కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభించిందని తహశీల్దార్ కె ఎల్ మహేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చల్లారెడ్డి పాలెం గ్రామ పంచాయతిలో వైఎస్ఆర్ శాశ్వత భూహక్కు మరియు భూ రక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రైతులను వెంటాడుతున్న భూ సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం దృషి సారించి వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు , భూ రక్ష పథకాన్ని డిసెంబర్ 21న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకం ఒకరిపేరు మీద ఉంటే, రెవెన్యూ రికార్డుల్లో ఇంకొకరి పేరుతో ఉండేదని, ఫలితంగా సంక్షేమ పథకాలు సంబంధిత రైతులకు అందడంలేదని, అలగే రైతుల భూముల కు చెందిన రికార్డుల సమస్యలను గుర్తించి, భూ సమగ్ర సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

ఈ సేర్వే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కంటిన్యూస్ ప్రాసెస్ లో జరుగుతుందన్నారు. గ్రా మాల్లో రైతులకు ఉన్న భూములు, చిన్నచిన్న కమతాలను గుర్తించి ఆధార్ కార్డుల ఆధారంగా వారి వివరాలను ఆన్‌లైన్లో నమోదు చేస్తారన్నారు. డిసెంబర్ నెల చివరి నుంచి ఈ పునఃసర్వే ప్రారంభిస్తారని, ఇప్పటికే మండల సర్వేయర్లకు, సచివాలయ విలేజ్ సర్వేయర్లకు అధికారులకు శిక్షణ కార్యక్రమం పూర్తి అయినదన్నారు. ఈ సేర్వేకు రైతులు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఎన్ సూర్యనారాయణ, విఆర్ఓ సురేష్, సచివాలయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూములను అమ్ముకునేందుకు మూడు రాజధానుల ఆట : సౌమ్య



**నందిగామ, డిసెంబర్ 18 ప్రజాపాలన :** నందిగామ పట్టణ రైతుపేట పార్టీ కార్యాలయంలో దేశం నాయకులు, మాజీ శాసన సభ్యురాలు శ్రీమతి తంగిరాల సౌమ్యతో కలిసి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ అమరావతి రాజధాని రెఫరెండంగా వెళ్దామన్న చంద్రబాబు సవాల్ ను స్వీకరించే ధమ్ము ధైర్యం జగన్మోహన్ రెడ్డికి ఉందా ? జగన్మోహన్ రెడ్డి పై శాచిక ఆనందం కోసం రాష్ట్ర మంత్రులు పశు వులు, ఊర కుక్కల కంటే హీనంగా మాట్లాడుతున్నారు. సీఎం జగన్ అంతరంలోని మాటలనే మంత్రులు బాధ్యత లేకుండా అసహ్యంగా మాట్లాడుతున్నారు. తెదేపా హయాంలో కట్టిన రాజధాని భవనాల్లో ఉంటూ 18 నెలలుగా సీఎం జగన్ మంత్రులు తైత క్కలాడుతు న్నారు 1.30 లక్షల కోట్లు అప్పు తెచ్చి ఏం సాధించారు ? లక్షల కోట్ల సంపదను నాశనం చేసి, విశా ఖలో దోచుకున్న భూములను అమ్ముకునేందేకే మూడురాజధానుల ఆట ఆడుతున్నారు. రాష్ట్రాన్ని అవి నీతి మయం చేశారు.

డిసెంబర్ 15 కల్లా పంట నష్ట పరిహారం ఇస్తామన్నారు వచ్చాయా? 15వేల కోట్ల పంట నష్టం జరిగితే బూతుల మంత్రి ఒక్క ఎకరాన్ని ఐనా పరిశీలించి రైతుకు మనోధైర్యం చెప్పారా ?అవ నిగడ్డలో 3 కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ఈ ప్రభుత్వానికి ఏమైనా బాధ్యత ఉందా ?పోలవరం డ్యామ్ సైట్ లో రెండు వందల కోట్లు పనులు చేసి 25 0కోట్లతో అయ్యల విగ్రహాలు పెడతామని బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారు. దేవాదాయ మంత్రి సొంత నియోజకవర్గంలోని గుళ్ళ ఆస్తులు కాజేస్తూ, వరుస దొంగతనాలు జరుగుతుంటే పట్టించుకునే నాధుడే లేడన్నారు.

## క్రీస్తు సందేశం ఆచరణీయం : మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్

### సెమీ క్రిస్టమస్‌లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమంచి
### చీరాల మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్టమస్



**చీరాల (ఒంగోలు) :** ఏసు క్రీస్తు బోధనలు, సందేశం ఆచరణీయమని, క్రిస్మస్ సందర్భంగా, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. చీరాలలోని అంబేద్కర్ భవన్ వద్ద మున్సిపాలిటీ కార్మికుల ఆధ్వర్యంలో సెమీ క్రిస్టమస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ శాసనసభ్యులు, చీరాల నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ ఆమంచి కృష్ణమోహన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలియజేసారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి, అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ వేడుకల వెలుగును ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమంచి తో పాటు, చీరాల మున్సిపల్ కమిషనర్ యేసయ్య, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, రామకృష్ణ, వైసీపీ నాయ కులు కోటి దాసు, కర్నేటి రవి, గుద్దంటి సత్యనారాయణ, మేరుగ ఇస్సాకు, యాతం మేరీబాబు, సల్లూరి సత్యానందం, అలెక్స్, సల్లూరి అనిల్, డేటా దివాకర్, కోండ్రు కిరణ్, థామస్, బోనిగల పేతురు బాబు, గలబా బాబు, గోలి వెంక ట్రావు, మున్సిపాలిటీ సిబ్బంది, పారిశుధ్ధ్య కార్మికులు, కాంట్రాక్టు వర్కర్లు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వాడరేవు గ్రామంపై కటారిపాలెం గ్రామస్తుల దాడి పూర్తిగా అధికారుల వైఫల్యమే

### – రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత ప్రజాసంఘాల నాయకులు తీర్మానం



**చీరాల (ఒంగోలు) :** వాడరేవు గ్రామంపై కటారి పాలెం గ్రామస్తుల దాడి,పూర్తిగా పోలీస్ అధికారులు, ప్రభుత్వ అధికారుల వైఫల్యం కారణమేనని శుక్రవారం జరిగిన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత ప్రజాసంఘాల నాయకులు తీర్మానించారు. స్థానిక చీరాల లోని ఎన్జీవో భవన్ లో జరిగిన దళిత, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బలహీనవర్గాల సమైక్య రాష్ట్ర కార్యదర్శి గోశాల ఆశీర్వాదం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వాడరేవు, కటారి పాలెం గ్రామాల మధ్య హైలా వల వల వల వివాదం గత మూడుసంవత్సరాలుగా ఉన్నా, గత తొమ్మిదినెలలుగా పరస్పర వాదోపవాదాలు జరుగుతున్నప్పటికీ వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని ఆ కారణంగానే ఈనెల కటారిపాలెంకు సంబంధించిన మత్స్యకారులు, మూకుమ్మడిగా పోలీసుల సమక్షంలో, వాడరేవు గ్రామంపై దాడి చేయడం జరిగిందని, ఈ దాడిని అరికట్టడంలో పోలీసులు ప్రభుత్వ అధికారులు విఫలమయ్యారని, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వాడరేవు గ్రామంపై జరిగిన దాడి పై సమగ్ర విచారణ జరిపించి దాడికి పాల్పడిన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని, వాడరేవు గ్రామస్తులపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని, దాడిలో గాయపడిన ఒక్కో కుటుంబానికి 5 లక్షలు రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, గాయపడిన వాడరేవు మాజీ సర్పంచ్ రమణ, తోటి వారికి మెరుగైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్.బాబురావు, నాగేశ్వరరావు, ఎం వసంతరావు, ఎరుకల హక్కుల పోరాట సంఘం నాయకులు మోహన్ కుమార్ ధర్మ, బీరకా పరమేష్, ఊటుకూరి వెంకటేశ్వర్లు, మెద వెంకటరావు, బి సామేల్, రవికుమార్, జీ.ఏసుబాబు, పుల్లయ్య, సూర్యప్రకాశరావు, ప్రతాప్, బ్రహ్మయ్య, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు


అంబేడ్కర్ రాజనీతి ఉద్యమం
Ambedkar Rajaneethi Movement (ARM)
www.ambedkarrajaneethi.com

బహుజనుల కోసం డిమాండ్లు
1. మద్యపానాన్ని నిషేధించాలి
2. మహిళలకు అన్నింటా 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి.
3. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేయాలి.
4. న్యాయ వ్యవస్థలో రిజర్వేషన్లు కల్పించాలి.
5. వెనుకబడిన తరగతులకు చట్ట సభల్లో 50 - రిజర్వేషన్ కల్పించాలి.
6. ఎస్సీ లకు మత స్వేచ్ఛ కల్పించాలి.
7. బుద్ధుడు ప్రవచించిన సమతా భావాన్ని సమర్థించేలా చర్యలు చేపట్టాలి.
8. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని కులాలకు రిజర్వేషన్ కల్పించాలి.
9. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి.
10. రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో చేర్చాలి.
11. అందరికి ఉచిత విద్య కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంను ప్రవేశ పెట్టాలి.
12. ప్రైవేట్ విద్యాసంస్థలను రద్దు చేయాలి.
ఇప్పటికే ఉన్న ప్రైవేటు విద్యా సంస్థల్ని ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవాలి.
13. ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్యం అందించాలి.
14. ప్రైవేట్ ఆస్పత్రులను రద్దు చేయాలి.
15. పరిశ్రమల్ని జాతీయం చేయాలి. ప్రైవేట్ రంగంలో నడిచే పరిశ్రమల్లో రిజర్వేషన్ కల్పించాలి.
16. ఆధార్ కార్డు ఉన్న ప్రతి పౌరుడికి 2,00,000/- రూపాయలు ఋణం ఇవ్వాలి.
సక్రమ చెల్లింపుపై తరువాత సంవత్సరం రెట్టింపు ఋణం ఇవ్వాలి.
17. భూమిలేని రైతులకు ప్రభుత్వ/దేవాలయ లేదా ఇతరత్రా ఏదైనా 4 ఎకరాల భూమి ఇవ్వాలి.
18. ప్రతీ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలి.
19. వలసలను అరికట్టేందుకు ఎక్కడికి అక్కడే గ్రామీణ ప్రాంతాల్లో సరికొత్త సాంకేతిక వ్యవసాయ, కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
20. వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.
21. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరలను ముందుగానే ప్రకటించాలి.
ఇటువంటి విలువైన అంశాలు ఇంకా ఏవైనా ఉంటే దయచేసి మా దృష్టికి తీసుకురండి.

ఆహ్వానం
అంబేడ్కర్ రాజనీతి ఉద్యమంలో భాగస్వాములుగా చేరేందుకు బహుజనులందరికీ ఆహ్వానం.
జై భీం, జై ఫూలే, జై బహుజన
సెంట్రల్ వర్కింగ్ కమిటీ
అంబేడ్కర్ రాజనీతి మూవ్ మెంట్

ప్రజాపాలన

సంపాదకీయం

శనివారం 19 డిసెంబరు 2020

# కాంగ్రెస్‌కు భవిష్యత్తు ఉందా?

ప్రజల ఆలోచనల్లో మార్పు వస్తోందని చెప్పడానికి కొలమానాలు లేవు. ఒకవేళ దళితులు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజల ఆలోచనల్లో మార్పు వస్తోందని అనుకున్నా, ప్రత్యామ్నాయం లేకపోతే ఆ మార్పు ఆచరణ రూపం దాల్చదు. మరి ప్రజలు తమవైపే మొగ్గు చూపుతున్నారని దేశ పాలక పక్షం చెప్పుకుంటే ఎవరు కాదనగలరు?

భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజలకు ఏ మాత్రం వ్యతిరేకత లేదని, ఎన్ని సంవత్సరాలు పాలించినా, ప్రజలు తమను ఆదరిస్తూనే ఉంటారని ప్రధానమంత్రి తో సహా ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనే కాక, వివిధ రాష్ట్రాల ఉప ఎన్నికల్లో బిజెపి మెజారిటీ సీట్లలో విజయం సాధించింది. దీంతో ఇక ఏ ఎన్నికలు జరిగినా బిజెపికి తిరుగుండదనే అభిప్రాయానికి ఆస్కారం ఏర్పడింది. ఎన్నికల్లో గెలిచే కళలో బిజెపి ఆరితేరిందని, మిగతా పార్టీలకు ఆ విద్య ఇంకా పట్టుబడలేదన్న విషయం కూడా స్పష్టం అవుతోంది. మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థ దినదిన ప్రవర్ధమానం అవుతూ దేశం సుభిక్షంగా ఉన్నదని, ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, నిరుద్యోగం అనేది క్రమక్రమంగా మటుమాయమవుతోందని, అవినీతికి తావులేని స్వచ్ఛమైన పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ అలారారుతున్నాయని అందుకే ప్రజలు బిజెపికి శాశ్వతంగా అధికారాన్ని అప్పగించే అవకాశాలున్నాయని ఎన్నికల ఫలితాలను బట్టి ఎవరైనా అర్థం చేసుకుంటే కాదనలేం. ఎందుకంటే ప్రజా స్వామ్యంలో ఫలితాలను బట్టే వనితీరు నిర్ణయమవుతుంది. ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నత విద్యను అభ్యసించిన విద్యాధికుడు, దేశంలో కీలకమైన ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన మన్మోహన్ సింగ్ స్థానంలో ఈ దేశ ప్రజలు ఒక సాధువులా కనిపించే నరేంద్రమోదీ చేతికి పగ్గాలు అప్పగించిన నాటి నుంచీ ఆర్థిక, రాజకీయ సామాజిక పరిణామాలు వినూత్న దశలో సాగిపోతున్నాయి. ప్రజల విచక్షణను కాదనగల శక్తి ఎవరికీ లేదు.

ప్రజాస్వామ్యంలో అధికార పక్షం బలపడుతున్న కొద్దీ సహజంగానే ప్రతిపక్షం బలహీనపడుతుంది. మరో రకంగా చెప్పాలంటే ప్రతిపక్షం బలోపేతం కాలేకపోతే అధికార పక్షానికి తిరుగుండదు. ఈ రెండింటిలో ఏది కరెక్టు అనేది తార్కికంగా అంచనా వేయాలంటే గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను నిదర్శనంగా తీసుకోవాలి. మన్మోహన్ సింగ్ కూడా పదేళ్లు అధికారంలో ఉన్నారు. పైగా ఆయన సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించారు. కాని మన్మోహన్ సింగ్ 2009లో రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమంగా కాంగ్రెస్ బలహీన పడుతూ భారతీయ జనతా పార్టీ బలోపేతం అవుతూ వచ్చింది. 2010లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి 91 సీట్లు రాగా, కాంగ్రెస్ కు 4 సీట్లు మాత్రమే వచ్చాయి. 2012లో గోవా, పంజాబ్ ఎన్డీఏ చేతికి వచ్చాయి. 2013లో రాజస్థాన్, మధ్యప్రదేశ్ బిజెపి కైవసం కాగా, ఢిల్లీలో బిజెపి అత్యధిక సీట్లు సాధించింది. ఇక 2014లో సార్వత్రిక ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడమే కాక, మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్, జమ్మూ- కశ్మీర్ లో కూడా ఎన్డీఏ అధికారంలోకి రాగలిగింది. ఇప్పుడు 2019లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సారథ్యంలో రెండవ సారి బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పరిస్థితి ఏమిటి? గతంలో తన హయాంలో బలోపేతమయ్యేందుకు బిజెపి ప్రయత్నించినట్లే, బిజెపి హయాంలో తాము బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నదా? అలాంటి ప్రయత్నాలు చేయడం లేదనే ఇటీవలి ఎన్నికల ఫలితాలు నిరూపిస్తున్నాయి.

బిహార్ ఎన్నికల్లో 70 అసెంబ్లీ సీట్లలో పోటీ చేసినప్పటికీ కేవలం 19 సీట్లలో కాంగ్రెస్ గెలిచింది. సోనియా తనయ ప్రియాంకా వాద్రా ఇన్‌ఛార్జిగా ఉన్న ఉత్తర ప్రదేశ్ లో 6 సీట్లకు ఉప ఎన్నికలు జరిగితే అన్నిటిలో ఓడిపోవడమే కాక నాలుగు సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్ కూడా కోల్పోయారు. కాంగ్రెస్ ప్రతిపక్షంగా ఉన్న గుజరాత్ లో 8 సీట్లకు ఉప ఎన్నికలు జరిగితే అన్ని సీట్లలోనూ ఆ పార్టీ పరాజయం పాలైంది. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు తిలోదకాలిచ్చి బిజెపితో చేతులు కలిపిన 25 మందిలో 15 మంది మళ్లీ బిజెపి టికెట్‌పై పోటీ చేసి గెలిచారు. ఈ రాష్ట్రంలో ఎన్నడూ విజయం సాధించని ప్రాంతాల్లో కూడా బాజెపి ఈ సారి జయపతాక ఎగురవేసింది. కర్ణాటకలో కూడా బిజెపి ఏనాడూ గెలవని సీరా అసెంబ్లీ నియోజకవర్గంలో ఆ పార్టీ విజయం సాధించింది. తెలంగాణలో ని దుబ్బాకలో కాంగ్రెస్ మూడో స్థానానికి పడిపోయింది. ఈ పరిస్థితి చూస్తుంటే భవిష్యత్ లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి ఎలా ఉంటుందన్న విషయం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశం కావడంలో ఆశ్చర్యం లేదు. బిహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ తో మరే పార్టీ అయినా చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉంటుందా అన్న విషయం కూడా అనుమానాస్పదమే. బిహార్ లో కాంగ్రెస్ కు అన్ని సీట్లు ఇచ్చి ఉండాల్సింది కాదని, ఆ పార్టీ వల్లే అధికారంలోకి రాలేకపోయామని రాష్ట్రీయ జనతాదళ్ నేతలే కాదు తారిఖ్ అన్వర్ వంటి కాంగ్రెస్ నేతలు కూడా బహిరంగంగా విమర్శిస్తున్నారు. విచిత్రమే మంటే కాంగ్రెస్ 70 సీట్లు తీసుకున్నప్పటికీ ఆ సీట్లను గెలిచేందుకు అవసరమైన వ్యూహరచన చేయలేకపోయింది. ఉధృతమైన ప్రచారాన్ని నిర్వహించలేకపోయింది. ఆ రాష్ట్రంలో రాహుల్ గాంధీ పర్యటిస్తే ఏ మాత్రం హడావిడి కనిపించ లేదు. కొన్ని సభల్లో తేజస్వి యాదవ్ వచ్చి ప్రసంగించి వెళుతుంటే రాహుల్ గాంధీ అనామకుడుగా కూర్చుని గమనించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోరాడే స్ఫూర్తి లేన పుడు అన్ని సీట్లు ఎందుకు తీసుకోవాలి? ఎన్నికల ముందు కాంగ్రెస్ ఏమైనా సర్వేలు జరిపించిందా? సంస్థాగత యంత్రాంగాన్ని పటిష్ఠం చేసిందా? అన్న ప్రశ్నలకు జవా బిచ్చే నాథుడు కాంగ్రెస్ పార్టీలో లేడు. ఉధృతంగా ఎన్నికల ప్రచారం జరుగుతుం టే రాహుల్ సిమ్లాకు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారని ఆర్‌జెడి నేత ఒకరు వ్యాఖ్యానించారు. బిహార్‌కు వెళ్లక పోవడమే కాదు, తాను ఇన్‌ఛార్జిగా ఉన్న ఉత్తర ప్రదేశ్‌లో కూడా ప్రియాంకా వాద్రా పెద్దగా పట్టించు కున్న సందర్భాలు కనపడ లేదు. గత ఫిబ్ర వరి నుంచి ఆమె 'వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారు..' అని ఒక కాంగ్రెస్ నేత వ్యాఖ్యానించారు.

నిజానికి మొత్తం కాంగ్రెస్ పార్టీ నాయకత్వమే 'వర్క్ ఫ్రమ్ హోమ్' చేస్తున్నట్లు కన పడుతోంది. అధికారంలో ఉన్న లేకపోయినా ప్రతి రాష్ట్రంలోనూ బిజెపి వివిధ అనధికార, అధికారిక కమిటీలను, సోషల్ మీడియా బృందాలను నియమిస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. కాని కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఏ పదేళ్లు అధికారంలో ఉన్నా తమ వనరులను గ్రామాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసేందుకు ఏ మాత్రం ఉపయోగించలేదు. నేతలు వృద్ధులు కావడం, అవినీతికి అలవాటు పడడం, స్వప్రయోజనాలకే ఎక్కువ ప్రాధా న్యత నివ్వడం వల్ల బిజెపి నేతల మాదిరి ఒక నిర్మాణాత్మక శక్తిగా, పార్టీకోసం అం కిత భావంతో కృషి చేసే వారు కాంగ్రెస్ లో కొరవడంతో రాహుల్ గాంధీ వంటి యువనేత చేతికి పగ్గాలు వచ్చినప్పటికీ ఏమీ లాభం లేకపోయింది. వారసత్వంతో నిమిత్తం లేని నాయకులను ప్రోత్సహించగలిగిన లక్షణం బిజెపిలో ఉండగా, కాంగ్రెస్‌లో వారసత్వమే నాయకత్వం కావడం కూడా ఇందుకు ఒక కారణం కావచ్చు. ఏ వారసత్వమూ లేని పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్నప్పుడు కొందరు పార్టీ నేతలే పక్కలో బల్లెంలా వ్యవహరించే వారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో తీవ్ర విమర్శలకు గురిచేసేవారు. బహిరంగ వ్యాఖ్యానాలు చేస్తూ నాయకత్వాన్ని బలహీన పరిచేవారు. మాటిమాటికీ లేఖాస్త్రాలు సంధించేవారు. ఏదైనా రాష్ట్రంలో ఎన్నికల్లో పార్టీ ఓడిపోతే ఇక వారికి పట్టపగ్గాలు ఉండేవి కావు. బిజెపికి అధికారం ధారపోస్తున్నారు.. అని విమర్శించేవారు. కానీ పీవీ ఏదో రకంగా వ్యూహ ప్రతివ్యూహాల ద్వారా వారిని అడ్డుకుని అయిదేళ్లు సంకీర్ణ ప్రభుత్వాన్ని విజయవంతంగా కొనసాగించారు. పీవీ అధికారం కోల్పోగానే వారు ఆయనను పక్కకు తప్పించేందుకు ఉక్కుమ్మడిగా కదిలారు. వారసత్వానికి నాయకత్వం అప్పగించేంతవరకూ వారు నిద్రపోలేదు. కానీ ఇప్పుడు రాష్ట్రం తర్వాత రాష్ట్రం కోల్పోతుంటే చిన్న చిన్న రణగొణధ్వనులను కూడా సహించలేకపోవడం కనిపిస్తోంది. పీవీ సాధించిన దాని కంటే పార్టీ రెండుసార్లు మూడోవంతు సీట్లు కూడా సాధించ లేకపోయినప్పటికీ నాయకత్వాన్ని పెద్దగా ప్రశ్నించేవారు కనపడడం లేదు. ఇవాళ పీవీ శతజయంతి సందర్భంగా కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఆ పార్టీలో సహజ లక్షణంగా ఉన్న స్వయం విధ్వంసక స్వభావమే దాన్ని రోజురోజుకూ హరింపజేస్తున్నదని అర్థమవుతోంది. కొద్ది రోజుల క్రితం గులాంనబీ ఆజాద్ తో పాటు 23 మంది నేతలు లేఖ రాసినా, ఇవాళ కపిల్ సిబాల్, చిదంబరం వంటి వారు వ్యాఖ్యానాలు చేసినా కాంగ్రెస్‌లో ఏదో ఒక మార్పు జరుగుతుందని భావించడానికి వీలు లేదు. కాని అసలు కాంగ్రెస్‌ను ప్రజలు ఒక సమర్థమైన ప్రత్యామ్నాయంగా భావిస్తున్నారా అని కపిల్ సిబల్ వేసిన ప్రశ్నకు చాలా ప్రాధాన్యత ఉన్నది. దేశంలో ప్రత్యామ్నాయం లేకపోవడం వల్లే నరేంద్రమోదీ సారథ్యంలోని బిజెపికి తిరుగులేకుండా పోతున్నదని, ప్రతిపక్ష పార్టీగా బలోపేతం కావాలన్న బలీయమైన ఆకాంక్ష కాంగ్రెస్‌లో కనపడడం లేదని దేశ సామాజిక, రాజకీయ పరిణామాలపై అధ్యయనం చేసే సిఎస్ డిఎస్ లోక్ నీతికి చెందిన ఒక పరిశోధకుడు తెలిపారు. కాంగ్రెస్ లో ఆత్మ పరిశీలన, సమీక్ష ఉంటే ఈ పరిస్థితి తలెత్తేదికా దని, లోపలి నుంచి కుళ్లిపోయిన ఒక వ్యవస్థగా పార్టీ మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒక బలమైన నాయకత్వాన్ని జాతీయ స్థాయిలోనూ రాష్ట్రాల్లోనూ ఏర్పర్చగలిగిన శక్తి కాంగ్రెస్ కోల్పోయినట్లు కనపడుతోందని ఆయన అన్నారు. మరో వైపు ప్రాంతీయ పార్టీలు కూడా విశ్వసనీయత కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. వీటన్నిటికి తోడు బిజెపి ప్రతి ఎన్నికనూ సీరియస్‌గా తీసుకుని అన్ని శక్తులూ ఒడ్డి పోరాడేందుకు, ముఖ్యంగా కార్యకర్తలతో పనిచేయించేందుకు సిద్ధపడుతోందని ఆయన అన్నారు. ప్రజల ఆలోచనల్లో మార్పు ఏర్పడుతుందని చెప్పడానికి కొలమానాలు లేవు. ఒక వేళ దళితులు, మైనారిటీలు, ఇతర అణగారిన వర్గాల ప్రజల ఆలోచనల్లో మార్పు ఏర్పడుతోందని అనుకున్నా, ప్రత్యామ్నాయం లేకపోతే ఆ మార్పు ఆచరణ రూపం దాల్చదు. కనుక ప్రజలు తమ వైపే మొగ్గు చూపుతున్నారని ఎవరైనా చెప్పు కుంటే దాన్ని కాదనడానికి వీలు లేదు.

# రాజధానిపై బిజెపి వంద నాలుకల ధోరణి

మూడు రాజధానులపై అసెంబ్లీలో తీర్మానం చేసి సంవత్సరం గడిచిపోయింది. అమరావతి రైతులు, ప్రజానీకం చేపట్టిన ఉద్యమం ప్రారంభమై సంవత్సరం నిండింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేపట్టినా ఎక్కువ భాగం వివాదాస్పద నిర్ణయాలు, కక్ష రాజకీయాలు, వ్యతిరేక చర్యలతో కాలం గడిచిపోయింది. పాలన కూడా కుంటుపడుతోంది. ముఖ్యమైన అంశాలపై లిటిగేషన్లతో ప్రభుత్వం కోర్టుల చుట్టూ తిరుగుతోంది. ఈ కాలంలో రాజధాని అభివృద్ధి స్తంభించింది. సంక్షేమం కొంతలో కొంత మెరుగైనా రాష్ట్రమంతా అభివృద్ధి అస్తవ్యస్తంగా మారింది.ఆనాడు ప్రపంచ స్థాయి, అద్భుత రాజధాని అంటూ టిడిపి ప్రభుత్వం ఆశలు రేకెత్తించింది. పరిమిత పనులతో సరిపెట్టింది. నేడు రాజధానిని ముక్కలు చేసే పేరుతో ప్రాంతీయ వైషమ్యాలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని వైసిపి ప్రయత్నిస్తోంది.

**రాజధానిని, రాష్ట్రాన్ని నిండా ముంచిన బిజెపి**

ఆరున్నర సంవత్సరాల నుండి కేంద్రంలో బిజెపినే అధికారంలో కొనసాగుతోంది. ఈ కాలమంతా రాజధానికి, రాష్ట్రానికి బిజెపి, కేంద్రం తీరని ద్రోహం చేసింది. బిజెపి నేత వీర్రాజు గారికి అమరావతి అకస్మాత్తుగా గుర్తొచ్చింది. 2024లో రాష్ట్రంలో అధికారం లోకి తీసుకు వస్తే రాజధానిని 5 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పరుస్తామని సెలవిచ్చారు. మాట మార్చడం, మడమ తిప్పడం తమకు అలవాటు లేదని నమ్మబలుకుతున్నారు. ఆరున్నరేళ్ల నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న విషయం మర్చిపోయినట్లున్నారు. గత ఐదు సంవత్సరాలు రాష్ట్రంలో టిడిపి తో కలిసి బిజెపి అధికారంలో కొనసాగిన సంగతి గుర్తున్నట్లు లేదు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణం బాధ్యత కేంద్రానిదే. రాజధాని శంకుస్థాపన సందర్భంలో మోడీ చెంబుడు నీళ్లు, పిడికెడు మట్టి తెచ్చి రాజధానికి నిధులు ఇవ్వకుండా ఆంధ్రప్రదేశ్ ప్రజల నోట్లో మట్టి కొట్టారు. గత రెండు సంవత్సరాల నుండి కేంద్ర బడ్జెట్లో అమరావతి ప్రస్తావనే లేదు. విజయవాడ మెట్రో గాలికొదిలేశారు. అమరావతికి రైలు ప్రాజెక్టు ఏనాడో మర్చిపోయారు. ప్రత్యేక హోదా మాట ఇచ్చి నమ్మించి మోసం చేసింది బిజెపి కాదా? వెనుకబడిన ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఏమైంది? పోలవరం నిధుల కోత పెడుతున్నారు. కడప ఉక్కు ఊసే లేదు. 'అమరావతి లోనే బిజెపి ఆఫీస్ నిర్మించుకున్నాం. మమ్మల్ని నమ్మండి' అని వీర్రాజు పదే పదే చెబుతున్నారు. ఆఫీసు నిర్మించుకుంటున్నారు కానీ రాజధాని నిర్మించడం లేదు. రాష్ట్రంలో అధికారం ఇస్తే తప్ప రాజధాని నిర్మాణం చేయమని పరోక్షంగా ప్రజలను బెదిరిస్తున్నారు. అంటే ఇప్పటి వరకు రాష్ట్రంలో బిజెపి కి ఓట్లు రాలేదనే కక్షతోనే హోదా ఇవ్వలేదా? రాజధానికి నిధులు ఇవ్వటం లేదా? ఈ కాలమంతా రాజధానిపై పరస్పర భిన్నమైన ప్రకటనలతో బిజెపి నేతలు ప్రజలను గందరగోళ పరుస్తూ వచ్చారు.

మూడు రాజధానులు కాకపోతే 30 రాజధానులు ఉంటాయని ఒక నేత, మూడు రాజధానులు కాదు మూడు సచివాలయాలు ఉండాలని మరో నేత ఇలా పలురకాల వ్యాఖ్యలు చేశారు. రాజధానితో తమకు సంబంధమే లేదనీ కేంద్రంలోని బిజెపి సర్కార్ హైకోర్టులో అఫిడవిట్లు దాఖలు చేసింది. అమరావతి అంగుళం కూడా కదలదని చెప్పిన నేతలు ఇప్పుడు ఎక్కడున్నారు? ఢిల్లీని తలదన్నిన రాజధాని నిర్మిస్తామని 2014లో మోడీ ఇచ్చిన మాట ఏమైంది? బిజెపి నేతలతో తేడాల వల్ల ఇలా మాట్లాడుతున్నారని కొందరు అమాయకంగా అనుకుంటున్నారు. బిజెపి నేతలు ఈ నాటకంలో ఎవరి పాత్ర వారు పోషిస్తున్నారు. అంతే తప్ప బిజెపి విధానంలో గందరగోళం లేదు. ప్రజలను గందరగోళపరిచి, రాష్ట్రాన్ని చిన్నాభిన్నం చేయడమే వారి విధానం. దేశంలో వంద రాష్ట్రాలు ఉండాలని భాషా ప్రయుక్త రాష్ట్రాలను ముక్కలు చేసే విధానం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ది. మతం పేరుతోనే కాదు ప్రాంత ప్రజల మధ్య కూడా చిచ్చు పెట్టే రాజకీయం బిజెపి ది. అమరావతి రైతులపై కేసులు పెడితే సహించం, దౌర్జన్యం చేస్తే ఊరుకోమని వీర్రాజు ఘీంకరించారు. దేశంలో రైతుల మీద నిర్బంధం, పౌర హక్కుల ఉద్యమ నేతలను ఏళ్ల తరబడి జైలులో పెట్టడం, దళితులు, మైనారిటీలపై దాడులు...చేస్తున్న బిజెపి దుర్మార్గాన్ని అందరూ గమనించాలి. మోడీ దేవదూత అని ఓ బడా నేత ఆనాడే పొగడ్తలు కురిపించారు. నేను ఆ మోడీ దూతనని నేడు వీర్రాజు చెప్పుకుంటున్నారు. మోడీ రైతుల పక్షమని చిలక పలుకులు పలుకుతున్నారు. మోడీ రైతుల పక్షమో అంబానీ, అదానీ పక్షమో దేశం కోడై కూస్తోంది. ఢిల్లీలో పోరాడుతున్న రైతాంగానికి ఖలిస్తాన్ ఉగ్రవాదుల ముద్ర వేసిన బిజెపి అమరావతి రైతులపై ప్రేమ కురిపిస్తూ కపట నాటకం ఆడుతోంది. రాజధానిని, రాష్ట్రాన్ని నిండా ముంచిన బిజెపి ని నమ్ముకుంటే ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది. బిజెపి అధికారం కోసం పావులు కదుపుతోంది. బిజెపి ప్రమాదాన్ని



రాష్ట్ర ప్రజలు ఇప్పటికే గమనిస్తున్నారు. కానీ కొత్త రూపాలలో ప్రజలను నమ్మించడానికి కొత్త కుట్రలకు బిజెపి తెర లేపుతోంది. అందుకే రాష్ట్ర రాజధానిని నాశనం చేయడంలో ప్రధాన ముద్దాయి బిజెపి. తోడు ముద్దాయిలు వైసిపి, టిడిపి లు.

**బిజెపి, టిడిపి, వైసిపిలది ఒకటే వైఖరి**

వైఎస్‌ఆర్ పార్టీ, ప్రభుత్వం రాజధానిపై పునరాలోచన చేయాలి. వివాదాలను కట్టిపెట్టాలి. ఉన్న పరిమిత వనరులతోనైనా రాజధాని నమూనా మార్చాలి తప్ప, స్థలాన్ని మార్చాలనుకోవటం వృథా ప్రయాసే. పోటీ ఉద్యమాలతో, అణిచివేతతో రాజధాని ప్రజల గొంతు నొక్కాలనుకోవటం తగదు. గతంలో రాజధానిలో జరిగిన అవినీతిపై విచారణ చేయవచ్చు. దోషులైన అధికారులను గత పాలకులను శిక్షించవచ్చు. కానీ ప్రజలను బలి చేయడం తగదు. బిజెపి కేంద్ర ప్రభుత్వ అండతో రాజధానిని ముక్కలు చేయవచ్చని వైసిపి, ముఖ్యమంత్రి జగన్ భ్రమ పడుతున్నారు. మోడీ, అమిత్ షా లను వేడుకుంటే జరిగేది ఏమీ లేదు. రాష్ట్ర ప్రజలను నమ్ముకుంటే మంచిది.

అన్నీ ఒకే చోట కేంద్రీకరించాలనే చంద్రబాబు మోడల్ రాజధాని విఫలమయ్యింది. ప్రపంచానికే ఆదర్శం అని చెప్పిన భూ సమీకరణ ఎదురు కొట్టింది. రైతుల్ని, పేదలను నట్టేట ముంచింది. ఇప్పటికీ ఈ వాస్తవాన్ని గమనించకుండా సింగపూర్ మోడల్ గురించి గొప్పలు చెప్పుకోవడం టిడిపి కి తగదు. ఇప్పుడైనా తప్పులు గుర్తించి సరిదిద్దుకోవటం తదనుగుణంగా వ్యవహరించడం మంచిది. అమరావతి ప్రాంత రైతులు ఈ దుస్థితిలో వుండడం వెనుక తన బాధ్యత నుండి టిడిపి తప్పించుకోలేదు. అప్పుడు ఇప్పుడు రాష్ట్రానికి, రాజధానికి ద్రోహం చేసిన బిజెపి పై పల్లెత్తు మాట మాట్లాడకుండా మోడీ భజన చేస్తే అమరావతి నిలబడుతుందా? కేంద్రంపై పోరాడకుండా అమరావతి రైతులను కాపాడతాం అంటే ఎలా నమ్ముతారు? అమరావతి ఉద్యమం విశాలంగా, విస్తృతంగా నడపాల్సింది పోయి అందులోనూ టిడిపి తన రాజకీయ ప్రయోజనాన్ని చూసుకుంటే రాజధాని రైతులకు జరిగే ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుంది.

బిజెపి, టిడిపి, వైసిపి లది అనేక విధానాలలో ఒకటే వైఖరి. ఆనాడు బిజెపి, టిడిపి కలిసి భూసమీకరణ చేపట్టాయి. పూర్తిగా విఫలం అయింది. ఈనాడు వైసిపి విఫలమైన భూ సమీకరణను రాష్ట్రమంతా చేపడుతోంది. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు సాధించటంలో ఆనాడు, ఈనాడు రెండు ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కేంద్రంపై ఒత్తిడి చేయడంలో టిడిపి, వైసిపి లది మెతక వైఖరే. ఇరు పార్టీలది లోపాయికారి కుమ్మక్కే. రాజధాని లోను, రాష్ట్రంలోనూ పౌర హక్కులను, ఉద్యమాలను అణచివేతలో ఎవరికి ఎవరు తక్కువ తినలేదు. రాజధాని ప్రాంతంలోని దళిత, అసైన్డ్ రైతులు, భూమి లేని పేదలు, కార్మికుల బాగోగులను గాలికొదిలేశాయి. ఆనాడు సింగపూర్, ఈనాడు దక్షిణాఫ్రికా నమూనాలు, విదేశీ కన్సల్టెన్సీలు, దుబారా ఖర్చులు, వృధా ఖర్చులు షరా మామూలే.

**సిపిఎం సూత్రబద్ధ వైఖరి**

రాజధాని, రాష్ట్ర అభివృద్ధి విషయంలో సూత్రబద్ధ వైఖరికి సిపిఎం అన్ని వేళలా కట్టుబడి ఉంది. అమరావతి రాజధానిపై అసెంబ్లీలో అన్ని పక్షాలు ఏకాభిప్రాయానికి వచ్చినందున రాజధాని స్థలం మార్పుపై వివాదం చేయడం తగదని ముందు నుండి చెబుతూనే ఉంది. రాష్ట్ర ప్రజలందరికీ అమరావతి సమ దూరంలో ఉంది కాబట్టి రాజధాని రైతులకే కాదు, రాష్ట్ర ప్రజలందరికీ ఇది మేలని వైఖరి తీసుకుంది. శాసనసభ, సచివాలయం ఒక దగ్గర ఉంటే పరిపాలన సౌలభ్యం, ప్రజలకు మేలని సిపిఎం భావించింది. హైకోర్టు కర్నూలులో పెట్టాలన్న ప్రభుత్వ ప్రతిపాదన పట్ల అభ్యంతరం లేదని సిపిఎం తెలిపింది. రాజధాని ఒకే చోట ఉన్నా అభివృద్ధి రాష్ట్రమంతా జరగాలని విద్యా, వైద్య సంస్థలు, పరిశ్రమలు అన్ని ప్రాంతాలకు విస్తరించాలని, అదే నిజమైన వికేంద్రీకరణ అన్న వైఖరికి సిపిఎం ఎప్పుడూ కట్టుబడి ఉంది. దానికోసం నిరంతర పోరాటం సాగిస్తూనే ఉంది. ఇప్పటికే అమరావతిలో ప్రజా ధనం ఖర్చు పెట్టారు, కాబట్టి వృధా చేయడం సరికాదని, ప్రభుత్వం మారినప్పుడల్లా రాజధానిలో మార్చటం రాష్ట్రాభివృద్ధికి గొడ్డలిపెట్టు అని భావించింది. ఆనాడు రాజధాని పూలింగ్ విధానం తప్పని, పరిమిత స్థలంలో రాజధాని నిర్మాణం చేసుకోవచ్చని చెప్పింది. పూలింగ్‌ను వ్యతిరేకించినందుకు ఆనాడు టిడిపి అభివృద్ధి నిరోధకులుగా సిపిఎం కు ముద్ర వేసింది. ఈనాడు వైఎస్సార్ ప్రభుత్వం రాజధాని, ఇళ్ల స్థలాలు పేరుతో విశాఖలో భూ సమీకరణ పేరు చెప్పి దళితుల అసైన్డ్ భూములు లాక్కుంటే తప్పని చెప్పింది, పోరాడింది. హైకోర్టులో కేసు వేసింది. దళితుల పక్షాన నిలబడి పోరాడినందుకు ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీ లోనే సిపిఎం పైన నిందలు వేయడం చూశాం.

రాజధాని అభివృద్ధి అంటే రాజధానిలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందాలని దానికై నిరంతర కృషి సిపిఎం సాగిస్తోంది. టిడిపి ప్రభుత్వ హయాంలో అసైన్డ్ రైతులకు కౌలు, సమానమైన ప్యాకేజీ అందించాలని, పేదలకు రాజధాని పెన్షన్ ఇవ్వాలని, హామీలు అమలు చేయాలని అనేక ఉద్యమాలు సాగించింది. పాక్షిక విజయాలు సాధించింది. ఆనాడు టిడిపి అడ్డంకులు పెట్టినా నిర్బంధాలు ప్రయోగించినా ప్రజల మద్దతుతో తన కృషి సాగించింది. నేడు వైసీపీ ప్రభుత్వంలో రాజధానిలోని పారిశుధ్య కార్మికులకు 7 నెలలు జీతాలు ఇవ్వకపోతే కార్మికులకు అండగా సిఐటియు పోరాటం కొనసాగిస్తోంది. హైకోర్టు, రాష్ట్ర సచివాలయం కాంట్రాక్టు సిబ్బంది వేతనాలు, భద్రతపై కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటానికి అండగా సిపిఎం నిలుస్తోంది. పేదలకు రాజధాని పెన్షన్ పెంపు, అసైన్డ్ భూములకు సమానమైన ప్యాకేజీపై ఎన్నికల ముందు తర్వాత వైసిపి ప్రభుత్వ నేతలు మాటలు తప్ప చేతలు లేవు. రాజధాని ప్రాంతంలో ప్రజా సమస్యలపై జరుగుతున్న కృషి, పోరాటం కొన్ని వర్గాల మీడియాకు పట్టదు. సిపిఎం రాజధాని ఉద్యమంతో గొంతు కలుపుతోంది. వారికి అండగా నిలుస్తోంది. అదే సందర్భంలో గత ప్రభుత్వాలు విధానాల విషయంలో తన స్వతంత్ర వైఖరిని ప్రదర్శిస్తోంది. ఉమ్మడి ఉద్యమాలకు మద్దతు ఇస్తోంది.

**బిజెపి మోసాన్ని గమనిస్తున్నారు**

అమరావతి రైతులు, ప్రజలు వైసిపి వైఖరిపై పోరాడుతున్నారు. బిజెపి మోసాన్ని గమనిస్తున్నారు. ఆనాడు గుర్రాలపై ఊరేగిన టిడిపి మంత్రులు కొందరు అడ్రస్ లేరని గుసగుసలు ఉన్నాయి. ఆనాడు సిపిఎం, వామపక్షాలు చెప్పినా వినకుండా ప్రభుత్వ మాటలు నమ్మి భూ సమీకరణలో భూములు ఇచ్చి మోసపోయామని భావించే వారు ఉన్నారు. కానీ కొందరు నేతలు రాజధానిని నట్టేట ముంచిన బిజెపి ప్రమాదాన్ని గమనించటం లేదు. బిజెపి ని నమ్ముకుంటే అమరావతి నిలబడుతుందని భ్రమ పడుతున్నారు. ఈ వైఖరితో రైతులకు, రాజధాని ప్రజలకు మేలు జరగదని అనుభవం తెలుపుతోంది. ఇప్పటికైనా నేతలు గమనించాలి. ఢిల్లీలో అనేక రాష్ట్రాలకు చెందిన రైతులు పోరాడుతూ ఉంటే వారికి సంఘీభావం తెలపటానికి రాజధాని జెఎసి నేతలకు తటపటాయింపులు ఉన్నాయి. ఢిల్లీలో రైతుల ఉద్యమం విజయం సాధిస్తే అమరావతిలో ప్రజా ఉద్యమానికి మేలు జరుగుతుందని వారు గమనించాలి.

ఢిల్లీలో రైతు ఉద్యమం జరుగుతున్న తరహాలోనే రాజధాని లోనూ విశాల ఉద్యమం సాగాలి. అది అమరావతికే పరిమితమైన ఉద్యమం కాదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నైతిక మద్దతు ఉండే విధంగా సాగాలి. రాజధాని కొరకే కాదు, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, కడప ఉక్కు, విభజన హామీల అమలు కోసం రాష్ట్ర ప్రజలందరూ ఉమ్మడిగా ఉద్య మించాలి. అమరావతి రాజధానిని నిలబెట్టుకోవటం, రైతులు, కూలీలు, పేదలకు న్యాయం జరగటం ఉద్యమ లక్ష్యంగా ఉండాలి. అప్పుడే అమరావతి ఉద్యమం విజయం సాధిస్తుంది.

## క్రీస్తు బోధనలు ప్రపంచానికి అనుసరణీయం

- అంజాద్ బాషా



**విజయవాడ, ప్రజాపాలన :** గురువారం గాంధీ నగర్ ఐలపురం హొటల్ లో డ్రీమ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సెమిక్రీస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి రాష్ట్ర మైనారిటి శాఖ మంత్రి అంజాద్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రపంచంలోనే అతిపెద్ద పండుగ అని అన్నారు. క్రిస్తును నమ్ముకున్న ప్రతి ఒక్క కుటుంబం దీవించబడిందని అన్నారు. క్రీస్తు పేద ప్రజల కోసమే వచ్చారని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆపేద ప్రజల కోసమే పాలన చేస్తున్నారని తెలిపారు. అనంతరం బ్రహ్మణ కార్పోరేషన్ చైర్మన్ మల్లాది విష్ణు మాట్లాడుతూ ఏక్కడైతే నా నామమున కూడి ప్రార్థిస్తారో వారి మధ్య నేను ఉంటానని ప్రభువు సెలవిచ్చారని అన్నారు. సూఫి మత గురువు అల్తాఫా రాజ మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు సమాజం లో అట్టడుగున ఉన్న పేదవారికి విధ్య, వైద్యం అందిచండలో వారి పాత్ర మరువలేనిదని అన్నారు. మధ్యహ్నా భోజనం లాంటివి ఆనాడే క్రైస్తవ మిషనరీలు నిర్వహించారని వారి స్పూర్తితోనే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి, ఆరోగ్య శ్రీ, మధ్యాహ్న భోజనం వంటిసంక్షేమ ఫలాలను ప్రతిఓక్కరికి అందుబాటులోకి తెచ్చారని అన్నారు. డ్రీమ్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఛైర్మెన్ మేధర సురేష్ మాట్లాడుతూ దేశంలో మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాల పక్షపాతి అని అన్నారు. ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా వైయస్ రాజశేఖర్ రెడ్డి స్పూర్తితో రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ప్రతి ఓక్కరికి చేరాలనే ఆశయంతో పని చేస్తున్నారని అన్నారు. ముందుగా ముఖ్యమంత్రి అంజాద్ బాషా బ్రహ్మణ కార్పోరేషన్ ఛైర్మెన్ మల్లాది విష్ణులు పిల్లలు జ్ఞానేశ్వరి తదితరుల సమాక్షంలో కేక్ కట్ చేసి క్రీస్మస్ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆద్యతం కోవిడ్ నిబంధనలను పాటిస్తూ నిర్వహించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో పెడన శాసన సభ్యులు జోగి రమేష్, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పల్నాటి ఉత్సవాలలో ఆకర్షణగా నిలిచిన గ్యాస్ బ్యాలన్

### వైసీపీ నేత కొమెర పిచ్చయ్యను అభినందించిన ఆచారవంతులు



**కారంపూడి, ప్రజాపాలన :** పౌరుషల గడ్డ పల్నాటి సీమ కార్యమపూడి నాటి రణక్షేత్రమే నేటి కారంపూడి వీరారాధన ఉత్సవాలు పల్నాటి వీరా రాధన ఉత్సవాలలో కారంపూడిలో ఆకర్షణగా నిలిచింది గ్యాస్ బెలున్ పల్నాటి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి అని సంకేతాలు తెలియపరిచేం దుకు వైసీపీ బిసి విభాగం నాయకుడు వడ్డెర సంఘం నాయకులు కొమెర. పిచ్చయ్య వైఎస్సార్సిపి జెండా రంగుతో దీన్ని ఏర్పాటు చేసి బెలున్ పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాచర్ల శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి నర్సారావుపేట పార్లమెంట్ సభ్యులు లావు. శ్రీకృష్ణ దేవరాయలు, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి, గుంటూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటూరు వెస్ట్ ఇంచార్జి మాజీ డిఐజి. చంద్రగిరి. ఏసురత్నం, కొమెర. పిచ్చయ్య ఫోటోలతో ఈ బ్యాలున్ ను ఏర్పాటు చేయటం జరిగింది ఇప్పటివరకు ఏ తిరునాళ్ల లోను ఇటువంటి బ్యాలున్ ను ఎవరు కూడా ప్రదర్శించలేదు కారంపూడి లోని అన్ని ప్రాంతాలకు ఈ బ్యాలున్ దర్శనమిస్తుండటంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది దీని విలువ సుమారు 25వేలు అవుతుంది అని దీన్ని ఏర్పాటు చేసిన వైసీపీ నాయకుడు కొమెర. పిచ్చయ్య ను మాచర్ల ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ పిన్నెల్లి. రామకృష్ణరెడ్డి, పిన్నెల్లి. వెంకటరామిరెడ్డి, మండల వైసీపీ నాయకులు, ప్రజలు అభినందించారు.

# లంకన్న ఒరుగుతో కల్లి తోరణాలపై ఒరిగిన కొణతాలు

## రసవత్తరంగా ముగిసిన కారంపూడి వీరారాధన ఉత్సవాలు







**కారంపూడి, ప్రజాపాలన :** పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు కల్లిపాడు ఘనంగా జరిగింది. గురువారం రాష్ట్ర నలుమూలల నుండి వచ్చిన వీరాచార వంతులు తమ దైవాలను పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఆనాడు పల్నాటి యుద్ధంలో భీకర పోరు జరిగింది. యుద్ధంలో అనేక మంది మృతి చెందారు. మృతుల్లో 66 మంది వీర సైనికులు మృతి చెందారు. వారిని స్మరించుకోవడానికి బ్రహ్మనాయుడు యుద్ధంలో తమకు అపజయం కలిగిందని 66 మంది మృత వీరులకు ప్రతి ఏటా స్మరించుకునే విధంగా వీరారాధన ఉత్సవాలు జరుపుకోవాలని పిడుగు వంశానికి చెందిన వారిని పీఠాధిపతిగా ఏర్పాటు చేసి బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలంలోనికి తపస్సుకు వెళ్తాడు. ఉత్సవాలలో దైవాలు పట్టణంలో గ్రామోత్సవం జరిపి పోతురాజు గుట్ట వద్ద ఉన్న కల్లితం గెడ మండపల పై ఓరుగుతాయి. దీంతో వీరాచార వంతులు తమ ఆయుధాలు (కొనతములు) నాగులేరు (గంగదారి మడుగు) స్నానం చేయించి తిరుగు ప్రయాణం పడతారు.

దీంతో పల్నాటి వీరరాధనా ఉత్సవాలు ముగిశాయి. వీరారాధన ఉత్సవాల సందర్భంగా పీఠాధిపతి ఆచారా వంతులకు కరోనా నేపథ్యంలో సమాచారం ఇవ్వనప్పటికీ తమ ఆచారం కొనసాగించుకునేందుకు తెలుగు రాష్ట్రాల లో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వీరాచారవంతులు, పిన్నపెద్దలు, కన్నమనిడులు తమ మొక్కుబడులను వీర్ల దేవాలయం, చెన్నకేశవ దేవాలయం, వీర్ల అంకమ్మ దేవాలయంలో మొక్కుబడులు చెల్లించుకునేందుకు వీరాచారవంతులు ఉత్సవాలకు వచ్చారు.

ఒకవైపు కరోనా నేపథ్యంలో సంప్రదాయ బద్ధంగా ఉత్సవాలు నిర్వహించా లని పల్నాటి పీఠం అధికారులు నిర్ణయించినప్ప టికీ ఆచారవం తులు మాత్రం తమ తమ ప్రాం తాల నుంచి కారంపూడి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు ఏది ఏమైనా పల్నాటి ఉత్సవాలు ఎంతో వైభవంగా 5రోజుల పాటు కొనసాగాయి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గురజాల డిఎస్పి ప్రసాద్ ఆదేశాల మేరకు రూరల్ సిఐ ఉమేష్ కుమార్ ఆధ్వర్యంలో కారంపూడి ఎస్ఐ గల్లా. రవికృష్ణ ప్రతిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

గురజాల, మాచర్ల, రెంట చింతల, దుర్గి, దాచేపల్లి మండలల నుంచి పోలిస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు తిరునాళ్లలో ఎక్కడ కూడా అవాంఛనీయమైన సంఘటనలు చోటు చేసుకోకుండా పోలిస్ శాఖ విశేషంగా కృషి చేసింది ఎంపిడిఓ బాలునాయక్ ఆధ్వర్యంలో కారంపూడి పంచాయతీ కార్యదర్శి కాశీ విశ్వనాధం ఐదు రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమలు నిర్వహించటమే కాకుండా వీర్ల దేవాలయం ఆవరణలో ఆచారవంతులు భక్తులకు అన్ని వసతులు కల్పించటంలో విశేషంగా కృషి చేశారు తిరునాళ్ల సందర్భంగా కారంపూడి విచ్చేసిన వీఐపి లకు తహసీల్దార్ ప్రసాద్ ప్రోటోకాల్ పాటించి వారికి అన్నివసతులు సమకూర్చారు ఏదిఏమైనా ఒకవైపు కరోనా భయం ఉన్న పల్నాటి విరచారా ఉత్సవాలు మాత్రం 5 రోజుల పాటు ఘనంగా నిర్వహించి నేటితో ముగిశాయి.

# ప్రతి జిల్లాలో అమరావతి పరిరక్షణ సమితి జనభేరి



**విజయవాడ, ప్రజాపాలన :** అటో నగర్‌లోని అమరావతి పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శివారెడ్డి మాట్లాడుతూ అమరావతి పరిరక్షణ ఉద్యమం చేపట్టి సంవత్సరం అయిన సందర్భంగా జనభేరిని నిర్వహించామన్నారు. ఈ జనభేరి విజయవంతం కావడంతో పాలకుల గుండెల్లో గుబులు పుట్టుకుందని, ఒక్క వైసీపీ మినహా మిగిలిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, రైతు సంఘాలు, 29 గ్రామాల ప్రజలు ఈ జనభేరికి విచ్చేశారన్నారు. ఉద్యమం జరుగుతున్న తీరును ప్రచురణ, ప్రసార మాధ్యమాలు ప్రపంచానికి తెలియజేశాయన్నారు. అమరావతే ఏకైక రాజధాని అని ప్రకటించే వరకు ప్రభుత్వంపై పోరాడతామని సభలో ప్రకటించిన రాజకీయ పార్టీలు, సంఘాల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతి ప్రాధాన్యతను వివరిస్తూ ప్రతి జిల్లా, మండలం, గ్రామంలో జనభేరిలు, రౌండు టేబుల్ సమావేశాలను నిర్వహిస్తామని శివారెడ్డి చెప్పారు. ఇలాంటి జనభేరిలకు అన్ని రాజకీయ పార్టీలు, ఇతర సంఘాలను కలుపుకుని నిర్వహిస్తామని, ప్రభుత్వం మూడు రాజధానుల ప్రతిపాదనను ఉపసంహరించుకునే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ జీవిఆర్ శాస్త్రి, హిందు మహాసభ అధ్యక్షులు మహా రాలు ఢిల్లీలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి అమరావతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమం చక్కగా జరుగుతుందని చెప్పారని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలో నిర్వహించిన జనభేరి సభకు అనుమతి ఉందని, అయినా పోలీసులు వ్యవహరించిన తీరు సరిగా లేదన్నారు. అధికార పార్టీకి తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మాకు అమరావతిలో రాజధాని వద్దు అంటూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్ళి ప్రచారం చేసేదమ్ముందా అని అన్నారు. కోవిడ్ వైరస్ కారణంగా ప్రభుత్వం బ్రతికిపోయిందని, లేకపోతే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే వారని తిరుపతిరావు అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలను మరింత మందిని కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అమరావతి రాజధాని కొసం వైసీపీ మినహా అన్ని పార్టీలు తమకు మద్దతు ప్రకటించాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఉద్యమం మరింత తీవ్ర రూపం దాలుస్తుందన్నారు. భూములు ఇచ్చిన రైతుల ప్రయోజనాలను కాపాడమంటే వారిని వ్యాపారస్తులతో పోల్చడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో జెఏసీ నాయకులు డాక్టర్ రాయపాటి శైలజ, రాంబాబు, గుంటూరు జెఏసీ నాయకులు మల్లిఖార్జునరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



**పొన్నూరు, ప్రజాపాలన :** పొన్నూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహొత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక లయన్స్ క్లబ్ లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా స్థానిక శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య విచ్చేశారు. ప్రెసిడెంట్ గా కోట .శ్రీనివాసరావు ,కార్యదర్శిగా కృపానందం ,కోశాధికారిగా హరి ప్రసాద్ ,ఫస్ట్ సెకండ్ వైస్ ప్రెసిడెంట్ లుగా ఎన్. అంకినీడు చౌదరి ,నాజర్ లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తమకు వచ్చిన అవకాశాన్నిసద్వినియోగం చేసుకొని ప్రజా సేవకు పాటుపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు ,వీర ప్రకాశ రావు ,విజయ చందర్ ,విజయ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. షేక్.జానీ బాష ,సుబాని అధ్యక్షులు గా ఎన్నికైన వారికి పూలమాలలు వేసి సత్కరించటం జరిగింది.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



**మంత్రాలయం, ప్రజా పాలన :** రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు జి. భీమిరెడ్డి, ఇన్ చార్జ్ విశ్వనాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ రంగ కృప వసతి గృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా 21వ తేది (సోమవారం) మండల కేంద్రంలోని దుర్గా రమణ కళ్యాణ మండపంలో నిర్వహించే రక్త దాన శిబిరం కు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టి. భీమయ్య, నాయకులు జనార్దన్ రెడ్డి, జమ్మి, వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

# వాలంటరీ గోపు బ్రహ్మయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి



**విజయవాడ, ప్రజా పాలన :** బిసి సంక్రాంతి సభలో పాల్గొని మృత్యువాత పడ్డ గ్రామ, వాలంటరీ గోపు బ్రహ్మయ్య కుటుంబానికి కోటి రూపాయలు ప్రభుత్వం ఎక్స్గ్రేషియా చెల్లించాలి! రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా డిమాండ్. నిన్న విజయవాడలో జరిగిన బీసీ సంక్రాంతి సభలో పాల్గొని మృత్యువాత పడ్డారు ప్రకాశం జిల్లా మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని మార్కాపురం మండలం గొట్టి బడియా గ్రామానికి చెందిన గ్రామ వాలెంటర్ గోపు బ్రహ్మం కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి. మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ సైదా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మార్కాపూర్ మండలం వైసిపి అధ్యక్షుడు వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గొట్టి బడియా గ్రామం నుండి సుమారు 50 మంది వెళ్లటం జరిగింది అని, సభ అనంతరం ఆ ప్రాంగణంలోనే ప్రభుత్వం ఏర్పాటుచేసిన భోజనం చేసి వాలెంటర్ గోపు బ్రహ్మం, రవి అనే మరో వ్యక్తి అస్వస్థతకు గురి కావడం జరిగింది వారిలో గోపు బ్రహ్మం మృతిచెందగా రవి గుంటూరు ఎన్నారై ఆసుపత్రి లో చికిత్స అనంతరం కోలుకోవడం జరిగిందని సైదా అన్నారు. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం సమగ్రంగా దర్యాప్తు చేయాలని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని ఆయన అన్నారు, మృతి చెందిన వాలెంటర్ బ్రహ్మం పార్థివ దేహానికి గుంటూరు ఎన్నారై హాస్పిట ల్‌లో పోస్టుమార్టం నిర్వహించకుం డా హుటాహుటిన గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహిం చేందూకు ఏర్పాట్లు చేయడంలో ఆంతర్యమేమి టని సైదా అన్నారు. వివిధ పత్రికల్లో , మీడియా ఛానల్స్ లో వాలంటరీ మృత్యువాత వార్త ప్రసారం కావడంతో నేడు మార్కాపు రం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారని ఆయన అన్నారు. ఏది ఏమైనా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ సంక్రాంతి సభలో పాల్గొని ప్రభు త్వం ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి మృత్యువాత పడ్డ ఉజ్వల భవిష్యత్తు ఉన్న 25 సంవత్సరాల యువకుడు, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన వాలంటరీ వ్యవస్థలో పని చేస్తున్న గ్రామ వాలెంటర్ గోపు బ్రహ్మం కుటుంబానికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని ఇంటికి అండగా ఉన్న యువకుడ్ని కోల్పోయిన ఆ పేద వ్యవసాయ కూలి కుటుంబా నికి ప్రభుత్వం బాసటగా నిలవాలని మార్కాపురం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ షేక్ సైదా డిమాండ్ చేశారు.

## ఘనంగా దైవ జనుల సెమి క్రిస్మస్ వేడుకలు




**బాపట్ల, ప్రజాపాలన :** బాపట్ల పట్టణం లోని జమ్ములపాలెం ఫ్లైఓవర్ వద్ద గల యం ఎస్ ఆర్ కళ్యాణమండపం నందు వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దైవ జనుల సెమి క్రిస్మస్ వేడుకలు ఘనం గా అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ వేగేశన నరేంద్రవర్మ, సినీ నటి దైవ సహాయకురాలు శ్రీమతి దివ్యావాణి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్ బాబు, బాపట్ల మండల మాజీ ఎంపీపీ మానం విజేత, దైవ ప్రసంగీకులు, బాపట్ల నియోజకవర్గంలోని అన్ని చర్చ్‌ల పాస్టర్‌లు పాల్గొన్నారు.

## డా.చదలవాడ అరవింద బాబుని మర్యాద పూర్వకంగా కలిసిన కూరపాటి హనుమత్ రావు



**నరసరావుపేట. ప్రజాపాలన :** నూతనంగా టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులుగా ఎన్నికైన (గురజాల నియోజకవర్గ కి చెందిన ) హనుమంత రావు కి శుభాకాంక్షలు తెలిపిన డా.చదలవాడ అరవింద బాబు . ఈ సందర్భంగా డా.చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్తాపించిందే బడుగు బలహీన వర్గాల ప్రజల కోసమని, ఉత్సహవంతమైన, ప్రజలకు మంచి చేసే సేవా భావం కలిగిన యువతకు పార్టీలో ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఉంటుందని, తెలుగు నాడు స్టూడెంట్ యూనియన్ కమిటీ పార్టీకి అనుసందంగా ఉంటూ పార్లమెంట్ అభివృద్ధి కి, యువతి, యువకుల అభ్యున్నతికి పాటుపడాలని, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మన మాజీ ముఖ్య మంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మనమందరం కష్ట పడి పనిచేసి తెదేపా పార్టీని మరల తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి చంద్రబాబు నాయుడు గార్ని ముఖ్యమంత్రిని చేసుకునే విధంగా పనిచెయ్యాలని డా.చదలవాడ అన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నూతన అధ్యక్షులు హనుమంతరావు మాట్లాడుతూ నా పై నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చిన చంద్రబాబు నాయుడు కి,జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కి , రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు కి,టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్ కీ, అలాగే నాకు ఈ పదవికి రావడానికి మద్దతిచ్చిన జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవింద బాబు, కొమ్మలపాటి శ్రీధర్, ఎరపతినేని శ్రీనివాస్, కొమ్మారెడ్డి చలమారెడ్డి గార్లకు కృత్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకులు శాఖమూరి మారుతి, నాగూర్,పెద్ది రెడ్డి రాజశేఖర్ రెడ్డి, వెంకట్ సాయి, వీరగ్రందం ప్రశాంత్, చుక్కపల్లి గోపి తదితరులు ఉన్నారు.

## ఎన్జీవో కాలనీలో అసలు లబ్దిదారులను నిగ్గు తేల్చాలి : జూనెబోయిన శ్రీనివాసరావు



**జగ్గయ్యపేట -(ప్రజాపాలన) :** జగ్గయ్యపేట పట్టణంలో గల సర్వే నెంబర్ 157,158 లో సుమారు 271 మందికి 1980-1981 సంవత్సరంలో అప్పటి ఉద్యోగస్థులకి ప్రభుత్వం 136 రూపాయల ఖరీదుతో 5 సెంట్ల స్థలాని ఇవ్వటం జరిగిందని,ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకపోవడంతో ఇండ్ల నిర్మాణాలు పూర్తి స్థాయిలో జరగలేదని,దీనితో ప్రభుత్వ విధి నిర్వహణలో లబ్దిదారులు వివిధ ప్రాంతాలకి బదిలీలు అవ్వటం,వారు ఎక్కువ శాతం వయస్సు పైబడి రిటైర్డ్ అయ్యారని,ఇదే అదునుగా రిటైర్డ్ అయిన ఉద్యోగులు స్థానికంగా లేరని గమనించిన కొంతమంది వ్యక్తులు ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసిన వ్యక్తుల ప్లాట్లలను ఆక్రమించటం జరిగిందని,దీనిలో పలుకుబడి గల్గిన వ్యక్తులు ఎక్కువగా ఉన్నారనే వాదనలు బలం వినిపిస్తున్నాయని సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు పత్రికా ముఖంగా తెలియజేసారు.ప్రభుత్వ సర్వీస్ చేసి రిటైర్డ్ అయి విశ్రాంతి తీసుకోవాల్సిన సమయంలో పలుకుబడి గల్గిన వ్యక్తుల కబ్జాల విషయమై జిల్లా,మండల స్థాయి అధికారుల చుట్టూ న్యాయం చేయుమని తిరుగుతుండటం వారి పట్ల కనీసం అధికారులకు సైతం కనికరం లేకపోవడం భాదాకరమన్నారు.ఇటువంటి సంఘటనలు బహిర్గతమౌతున్న అధికారుల తీరు మాత్రం స్థానిక పలుకుబడి గల్గిన వ్యక్తులకు కొమ్ముకాస్తున్నట్లుగా ఉందని ఆయన విమర్శించారు.గతం నుండి సిపిఐ పార్టీ అసలు లబ్దిదారుల పక్షాన వినతి పత్రానిచ్చిన నేటికి వాస్తవ లబ్దిదారులకు న్యాయం జరగలేదని,ఈ విషయంలో గౌరవ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మ్మెహన్ రెడ్డి జగ్గయ్యపేట పర్యటన సంధర్భంగా ఆయనే స్వయంగా పరిశీలించి సమస్యను పరిష్కరించాలని, 1980-1981 ప్రభుత్వం నుండి కొనుగోలు చేసిన వారి పేర్లను ప్రభుత్వం బహిర్గతం చేసి విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలని,స్థానిక పలుకుబడి గల్గిన వ్యక్తుల ఆనుచరులే కంచే చేను మేసిన చందంగా కబ్జాలు చేస్తే,విశ్రాంతి ఉద్యోగులకి న్యాయం ఎక్కడ జరుగుతుందని,అందుకే ముఖ్యమంత్రి వర్యులు ప్రత్యేక శ్రద్దతో 1980-1981 నాడు ప్రభుత్వం వద్ద కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు పత్రికా ముఖంగా కోరుతూ,ఈ విషయమై ఐక్యంగా గౌరవ ముఖ్యమంత్రిని కలసి వినతి పత్రాని ఇద్దామని ఆయన తెలియజేసారు.

# విద్యుత్ పొదుపు గురించి ఎన్జీవోల ద్వారా అవగాహన కల్పించాలి

–నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు




**గుంటూరు . ప్రజాపాలన :** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు పురస్కరించుకుని నరసరావుపేట పార్లమెంటు కేంద్రం లో పనిచేయుచున్న యన్. జి. ఓ ప్రెసిడెంట్ ఆర్. కె. దుర్గ పద్మజ గుంటూరు లో నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు ద్వారా ఐదవరోజు కార్యక్రమం నిర్వహించటము జరిగింది.ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేషనల్ ఎనర్జీ కన్సర్వేషన్ వీక్ జరుగుతుంది అని రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ చైర్మన్ గా ఉండే రాష్ట్ర ఇంధన పొదుపు కమిటీ ఈయొక్క జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు నిర్వహించటము జరుగుతుంది అని, ఈ కార్యక్రమం లో యన్.జి.ఓ సంస్థల భాగస్వామ్యం ద్వారా విస్తృత స్థాయిలో ప్రజలకు విద్యుత్ పొదుపుపై అవగాహన కలిపించడం జరుగుతుంది అని అన్నారు. సంవత్సరం లో ఒక్క వారం రోజులు మాత్రమే కాకుండా విద్యుత్ పొదుపు గురించి యన్. జి. ఓ ల ద్వారా నిరంతరం అవగాహన కలిపించాలి అని, ప్రతి ఒక్క డిస్కమ్ లో ప్రజా అవగాహన కమిటీలనునియమించి ఆ కమీటీ లో నీతి ఆయోగ్‌లో నమోదు కాబడిన యన్ .జి. ఓ సంస్థల ను భాగస్వామ్యం చేసి మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యుత్ వినియోగదారులకు అందజేసే పథకాలు ముఖ్యంగా విద్యుత్ వ్యవసాయ రైతులకు డైరక్టుగా నగదు బదిలీ, విద్యుత్ సేఫ్టీ, విద్యుత్ పొదుపు తదితర అంశాలపై ప్రచారం చేయాలని కోరారు. ముఖ్యంగా ఈ విద్యుత్ పొదుపు వారోత్సవాలలో విద్యుత్ వాడకం దారులు బ్యూరో ఆఫ్ ఎనర్జీ సర్టిఫికెట్ కలిగిన మరియూ స్టార్ రేటింగ్ కలిగిన విద్యుత్ గృహోపకరణాలు వాడాలి అని జాతీయ రహదారిపై యల్. ఈ. డి తో కూడిన లైటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది అని గృహ వినియోగదారులకు యల్. ఈ. డి బల్బులు ఇవ్వడం ద్వారా వారు చెల్లించే కరంటు బిల్లు మొత్తం తగ్గింది అని ఈ రాష్ట్రంలో పది వేల కోట్ల రూపాయలు విలువ కలిగిన విద్యుత్ పొదుపు చేసే అవకాశం ఉందని దీనికి సంబంధించి ప్రజా అవగాహన కార్యక్రమాలద్వారా నే ఇది సాధ్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యన్. జి. ఓ సభ్యులు కోటేశ్వరరావు, బాషా బంగారయ్య పాల్గొన్నారు.

## గండికోట నిర్వాసితులకు పరిహారం ప్యాకేజీలో అవినీతి: సోమిరెడ్డి



కడప: గండికోట నిర్వాసితులకు పరిహారం ప్యాకేజీలో అవినీతి జరిగిందని, ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోగస్ నిర్వాసితులకే డబ్బు పంపిణీ చేశారని ఆరోపించారు. అనలైన నిర్వాసితులకు ఇప్పటికీ పరిహారం అందలేదని చెప్పారు. సీఎం జగన్ సొంత జిల్లాలో అవినీతి జరిగినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని చంద్రమోహన్‌రెడ్డి తప్పుబట్టారు. టీడీపీ అధినేత చంద్రబాబు నియమించిన టీడీపీ నిజనిర్ధారణ కమిటి శుక్రవారం జమ్మలమడుగు ప్రాంతంలో పర్యటించింది. ఈ కమిటిలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీలు బిటెక్ రవి, బిటి నాయుడు, బీదా రవిచంద్ర, లింగారెడ్డి తదితరులు ఉన్నారు. గండికోట ప్రాజెక్టు ముంపు పరిహారంలో కోట్లాది రూపాయల అవినీతి, గురుప్రతాప్ రెడ్డి హత్యలపై నిజనిర్ధారణ కమిటి విచారించింది.


## 21న సీఎం వైఎస్ జగన్ పర్యటన

ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట -(ప్రజాపాలన) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డిసెంబర్ 21వ తేదీన జగ్గయ్యపేట పట్టణానికి రానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్,జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయభాను తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎం.వి.ఎస్ నాగిరెడ్డి గారితో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఉదయం 10:00 గంటలకు "వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష" పథకం ప్రారంభోత్సవానికి విచ్చేయనున్నట్లు తెలియజేశారు. అదేవిధంగా కార్యక్రమంలో భాగం గా జగ్గయ్యపేట పట్టణంలో గెంటేల శకుంతలమ్మ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ లో ప్రజలను ఉద్దేశించి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రసంగించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా జగ్గయ్యపేట మండలం లోని తక్కెళ్లపాడు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విచ్చేయుచున్న సందర్భంగా ఏర్పాట్లను ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ వైస్ చైర్మన్ నాగిరెడ్డి పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష" పథకం భూ సరిహద్దు రాయి ప్రాంతం, హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు.

## తల్లి మరణ ధృవీకరణ డిక్లరేషన్‌లో కూతురు ఫించన్ సమస్య పరిష్కారానికి నోచ్చుకోలేదు సియం గారు




**జగ్గయ్యపేట -(ప్రజాపాలన) :** జగ్గయ్యపేట పట్టణంలో కమలా థియేటర్ వద్ద గల 5 వ వార్డు సచివాలయం నుండి 68 సంవత్సరాల వయస్సు గల లింగం నిర్మలా వైయస్ఆర్ పించన్ కానుక నెం 106608964 గా ప్రతి నెల వాలంటరీ ద్వారా డబ్బులను తీసుకుంటుంది.సెప్టెంబర్ నెల పించన్ డబ్బులు ఆమెకు అందకపోవడంతో సదరు సచివాలయంలో విచారించగా ప్రభుత్వ ఎంప్లాయి అని ప్రభుత్వం తొలగించటం జరిగిందని సచివాలయ సిబ్బంది తెలియజేయటం జరిగింది.ఇదే రేషన్ కార్డులో కొడుకు ఆర్టిసి ఉద్యోగం చేయటంతో కూతురు కార్డులోకి సిఫ్ట్ చేయమనగా లింగం నిర్మలా ఆధార్ నెం 931687391424 గల తన ఆధార్ కార్డు నెంబరు చనిపోయిన తన తల్లి అయిన లింగం కృష్ణవేణి పేరులో నమ్మెదు కావటంతో లింగం నిర్మలా మరణించినట్లుగా మరణ ధృవీకరణ డిక్లరేషన్ గా కనబడుతుంది.ఈ విషయమై సచివాలయ అడ్మిన్ మరియు సంబందిత వాలంటరీని అడుగగా వారి తప్పుని కప్పిపుచుకొనుటకు వివిధ రకాలుగా సాకులు చెప్పటం జరిగింది.ఇది గమనించిన లింగం నిర్మలా కుటుంబ సభ్యులు మున్సిపాలిటీలో తన తల్లి మరణించిన తేదిని విచారించగా మరణాని నమ్మెదు కాబడలేదని మున్సిపల్ వారు తెలియజేసారు.ఈ విషయమై మండల తహసీల్థార్ కార్యాలయంలో యంఆర్ఒ ఆర్ రామకృష్ణ అనుమతితో రేషన్ కార్డును విచారించగా మరణించిన వ్యక్తి య్నెక్క ఆధార్ కార్డు నెంబర్ కాకుండా బ్రతికున్న కూతురైన లింగం నిర్మలా య్నెక్క ఆధార్ నెంబర్ మరణ డిక్లరైషన్ గా నమ్మెదైనదని తెలియజేయటం జరిగింది.ఈ విషయమై మరణ ధృవీకరణ డిక్లరేషన్ కొన్ని నెలల క్రితం ప్రభుత్వం సచివాలయ సిబ్బంది మరియు వాలంటరీలకు ప్రభుత్వం అనుమతులను ఇచ్చినట్లుగా తెలిసింది.కమలా థీయేటర్ దగ్గర గల ఐదో సచివాల సిబ్బంది మరియు వాలంటరీ నిర్లక్ష్యం వల్లే మరణ ధృవీకరణలో తప్పుగా బ్రతికున్న ఆమె వారి ఆధార్ కార్డు నెంబర్ ని నమ్మెదు చేసి చంపేసినట్లుగా,సచివాల సిబ్బంది వాలంటరీ వల్లే రేషన్ కార్డులో అర్హత కోల్పోయానని, పించన్‌ని సైతం కోల్పోయానని లింగం నిర్మలా వారి కుటుంబ సభ్యులు మీడియా ముందు ఆవేదనను వ్యక్తం చేసారు.ఎటువంటి ఆధారం ల్టేని 68 సంవత్సరాల లింగం నిర్మలా ప్రస్తుతం ఏమి చేయాలో తెలవక గందరగోళ పరిస్థితిలో ఉంది.ముఖ్యమంత్రి వైయస్ జగన్ మ్మెహన్ రెడ్డి స్పందించి ఇటువంటి తప్పులు చేసిన వారిని విచారించి వృద్దురాలైన తను ఎటూ తిరగలేనని,వెంటనే తనకు న్యాయం చేసి మరణ ధృవీకరణలో తప్పుగా ఎక్కించిన తన ఆధార్ నెంబర్ ని తొలగించి,సింగల్ గా ఉంటున్న తనకు సింగల్ పేరుతో తెల్ల రేషన్ కార్డును,ఆగిపోయిన వైయస్ఆర్ పించన్ ని ఇప్పించి ప్రభుత్వం తనని ఆదుకోవాలని ఆమె కోరుతుంది. సెప్టెంబర్ నెలలో జరిగిన అధికారులు విచారించిన నేటికి ఫించన్ అందలేదని,గౌరవ ముఖ్యమంత్రి వర్యులైన వెంటనే పరిష్కరించి పోయిన ఫించన్ ని ఇప్పించి ఆదుకోవాలని ఆమె పత్రికా ముఖంగా తెలియజేసింది.

## వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ట్రాక్టర్లతో ర్యాలీ



**షేర్ మహ్మద్ పేట -(ప్రజాపాలన):** గ్రామీణ ప్రాంతంలోని రైతులు ధైర్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వ్యవసాయ చట్టాల పై పోరాటం చేయాలని లేకపోతే రైతులకు ఉరితాడేనని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై కేశవరావు అన్నారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో రైతు సంఘం మరియు ప్రజా సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా,ఢిల్లీలో రైతులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు.ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేశవరావు మాట్లాడుతూ రైతులకు నష్టదాయకం కలిగించే 3 వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని,వ్యవసాయ మోటార్లకు పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని జీవో నెంబర్ 22 ను వెంటనే రద్దు చేయాలని,దేశంలో గత 21 రోజులుగా వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీలో చేస్తున్న దీక్షల్లో 22 మంది రైతులు మృత్యువాత పడ్డారన్నారు.

మోడీ ప్రభుత్వం చనిపోయిన రైతుల పట్ల కనీసం సానుభూతి కూడా చూపించడం లేదని ఇది చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులు చేస్తున్న నిరసన కార్యక్రమాలకు, ఢిల్లీలో రైతులు చేస్తున్న దీక్షలకు వ్యవసాయ బిల్లును వెంటనే రద్దు చేయాలని లేకపోయినట్లయితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నాగమణి,గౌస్ మియా,కోట కృష్ణ,వెంకటేశ్వర్లు, లింగారావు,కె రవి కుమార్,షేక్ బడే మియా,రైతులు గుద్దే బాబు, యం వెంకటి,మెట్టెల రమణ, శ్యామల మణి,శరణం నరసింహా రావు తదితరులు పాల్గొన్నారు.

## వేజండ్లలో సెమి క్రిస్మస్ వేడుకలు



**వేజండ్ల (ప్రజాపా లన):** మండల పరిధిలోని వేజెండ్ల గ్రామంలో గల ద్రాక్షావల్లి చర్చి నందు శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు సంఘ కాపరి వీసం మోషే అధ్యక్షతన ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పాస్టర్లు అధిక సంఖ్యలో పాల్గొని యేసు పుట్టుక గురించి, ఆయన గొప్పతనం గురించి సంగస్తులకు సువార్తను బోధించారు తర్వాత కేక్ కట్ చేశారు అనంతరం 500 మందికి ప్రేమ విందు చేశారు ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, గ్రామ పెద్దలు, యవనస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రెండు విద్యుత్ ప్రాజెక్ట్‌లను ప్రారంభించిన హెచ్‌సీసీబీ



విజయవాడ: భారతదేశంలో అగ్రశ్రేణి ఎఫ్ఎంసీజీ కంపెనీలలో ఒకటైన హిందుస్తాన్ కోకా – కోలా బేవరేజస్ (హెచ్‌సీసీబీ) విజయవంతంగా రెండు అదనపు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను విజయవాడ, అమీన్‌పూర్ (హైదరాబాద్ సమీపంలో) మహమ్మారి సమయంలో తమ ఫ్యాక్టరీల వద్ద ప్రారంభించింది. వీటిలో భాగంగా అమీన్‌పూర్ ఫ్యాక్టరీ వద్ద సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్‌ను ప్రారంభించింది. విజయవాడలోని ఫ్యాక్టరీ కోసం సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకుంది. ఈ మహమ్మారి సమయంలో ఏడు అదనపు పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్ట్‌లను ప్రారంభించింది. అమీన్‌పూర్ ఫ్యాక్టరీలోని సోలార్‌రూఫ్ టాప్ ప్యానెల్ ప్రాజెక్ట్‌ను దాదాపు 800కిలోవాట్‌పవర్ సామర్థ్యంతో ఏర్పాటు చేశారు. విజయవాడ ఫ్యాక్టరీ కోసం, హెచ్‌సీసీబీ ఇప్పుడు స్లిలాంద్రో పవర్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కొనుగోలు ఒప్పందం చేసుకుంది. దీనిలో భాగంగా 6 మిలియన్ యూనిట్ల సౌర విద్యుత్‌ను సరఫరా చేయనుంది. పునరుత్పాదక విద్యుత్ వనరులను వినియోగించేందుకు అవకాశాలను గురించి మా బృందం నిరంతరం అన్వేషిస్తూనే ఉంటుందని హెచ్‌సీసీబీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలోక్ శర్మ అన్నారు.

# సంక్రాంతి బరులకు అంతా సిద్ధం



**భీమవరం, డిసెంబర్ 18, (ప్రజాపాలన) :** సంక్రాంతికి మరో నెల రోజుల సమయముంది. పందెం కోళ్లకు సుమారు సంవత్సరం కాలంగా ఖరీదైన ఆహారంతో పాటు ఈత, ఇతర వ్యాయామాలు నేర్పిస్తున్నారు. కోళ్లు పెంచే చోట చిన్న చిన బరులు ఏర్పాటు చేసి పందెంలో శిక్షణ ఇస్తున్నారు. గతంలో కోడి పుంజుల్ని ఇళ్ల వద్ద, చేల గట్ల వద్ద, తోటల్లో పెంచే వారు. ఇప్పుడు బరులు జరిగే ప్రాంతంలోనే పుంజుల పెంపకం మొదలైంది. గిరాకీని బట్టి ప్రత్యేక ఫారాలు ఏర్పాటు చేసి మూడు నెలల నుంచి కోళ్లను అక్కడ మేపుతున్నారు. ఇంకా పండుగ నెల మొదలు కాకుండానే జిల్లాలో అప్పుడే కోడి పందాలు, కోతాట, గుండాటలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. గతేడాది కోడిపందాల నిర్వహణపై కోర్టు ఆదేశాలున్న నేపథ్యంలో పోలీసు కేసులు నమోదైనా పందెం రాయుళ్లు ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో తమకు ఎవరూ అడ్డు చెప్పరనే ధీమాతో రెట్టింపు ఉత్సాహంతో పందెంరాయుళ్లు ప్రయత్నాలు మొదలుపెట్టారు. గతంలో పందెం కోళ్ల పెంప కం ఎక్కడక్కడో జరిగేవి. ఇప్పుడు బరుల వద్దే పెంచు తూ ఏ క్షణమైనా పందాల నిర్వహణకు సిద్ధమంటున్నారు. ఈ సారి పందాలు జోరుగా సాగుతాయనే అభిప్రాయంతో పందెం రాయుళ్లు ఉన్నారు. తణుకు నియోజకవర్గాన్నే తీసుకుంటే గతేడాది ఇరగవరం మండలంలో 8 బరులు, అత్తిలి మండలంలో 6 బరులు, తణుకు పట్టణం, రూరల్ మండలంలో 20 బరుల్లో పందాలు జరిగినట్లు పోలీసు నివేదికలో పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఆ సంఖ్య పెరిగే అవకాశముందని నాయకులు చెబుతున్నారు రాగులు, జొన్నలు, ఇతర ధాన్యాలతో పాటు జీడిపప్పు, బాదంపప్పు, మటన్ కీమా పెట్టి పందాలకు సిద్ధం చేస్తున్నారు. గత సంవత్సరం గెలుపొందిన, గాయ పడ్డ పుంజుల్ని ఈ సంవత్సరం బరిలోకి దించేందుకు ప్రత్యేక ఆహారం పెడుతున్నారు. కోడి పందాల వద్ద గుండాట, పేకాట వంటివి ఏర్పాటు చేసుకునే పనిలో బరుల నిర్వాహకులు ఉన్నారు. దీని కోసం అనుభవమున్న వారిని ఇప్పటికే బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది. కేవలం కోడి పందాలతోనే మూడు రోజులు బరుల నిర్వహణ గిట్టుబాటు కాదని, గుండాట, కోతాట వంటి వాటి ద్వారా ఆదాయం పొందవచ్చనే ఆలోచనతో నిర్వాహకులున్నారు. గతంలో ఒక్కో బరి నిర్వాహకుడు రూ. 1 లక్ష నుంచి 10 లక్షల వరకూ ఆర్జించినట్లు పేర్కొంటున్నారు. సంప్రదాయం పేరుతో నిర్వహించే ఈ కోడి పందాలకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు అడ్డుకట్ట వేయలేకపోతున్నాయి. వీటిని చూసేందుకు రాజకీయ, సినీ ప్రముఖులు రావడంతో ఏమీ చేయలేపోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. పోటీల ముసుగులో కొందరు పోలీసులకు సొమ్ము ముడుతుండడంతో సంక్రాంతి పూర్తయ్యే వరకూ తమను బదిలీ చేయవద్దని ఉన్నతాధికారులకు విన్నవించుకుంటున్నారు.

# భీమిలిలో ఇక కష్టమేనా?



**విశాఖపట్టణం, డిసెంబర్ 18, (ప్రజాపాలన) :** కాంగ్రెస్‌లో పుట్టిన నాయకుడు. ఒకనాడు చంద్రబాబుని పదునైన విమర్శలతో ఎదుర్కొన్న నాయకుడు. కాలం కలసిరాక కాంగ్రెస్ కూలిపోతే వైసీపీలో చోటు లేకపోతే టీడీపీలో చేరిన ఆ నాయకుడే మాజీ ఎంపీ సబ్బం హరి. హరి ఇపుడు చంద్ర కీర్తనలతో అనుకూల మీడియాలో తరిస్తున్నారు. బాబు కూడా ఆయన్ని ప్రోత్సహిస్తున్నారు. గత ఎన్నికల్లో భీమిలీ నుంచి టీడీపీ తరపున పోటీ చేసే ఛాన్స్ సబ్బం హరికి ఇచ్చారు. మంత్రి అవంతి శ్రీనివాస్ చేతిలో సబ్బం హరి పది వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. నాటి నుంచి భీమిలీ ముఖం సబ్బం హరి చూడడంలేదని అక్కడి క్యాడర్ గగ్గోలు పెడుతోంది. ఇక భీమిలీ తన సొంత ప్రాంతమని సబ్బం హరి ఎలా చెప్పుకున్నా ఆయన ఎన్నో దశాబ్దాల క్రితమే దాన్ని వీడి వచ్చేశారు. ఆయన అసలైన చోటు ఏది అంటే విశాఖ ఉత్తర నియోజకవర్గం అని చెప్పాలి. ఇక సబ్బం హరి ఎపుడూ తన ఇల్లు దాటి వెళ్ళరు, అక్కడే తన అనుచరులతో పంచాయతీలు చేస్తూంటారని ప్రచారంలో ఉంది. ఆయన్ని భీమిలీ నుంచి ఎవరైనా కలవాలన్నా కూడా విశాఖ వెళ్లాల్సిందే. మరి ఆయన్నే భీమిలీ టీడీపీ ఇంచార్జిగా చంద్రబాబు ఎందుకు కొనసాగిస్తున్నారు అన్నది తమ్ముళ్ళ ఆవేదన. ఇపుడు సబ్బం హరి ఏడు పదులు దాటిన సీనియర్ నేత. కానీ ఆయనకు మళ్లీ పోటీ చేయాలని ఉందిట. అయితే ఈసారి విశాఖ ఎంపీ సీటుకే ఆయన గురి పెడుతు న్నారు. తనకు కచ్చితంగా విశాఖ ఎంపీ టికెట్ టీడీపీ ఇస్తుందని నమ్ముతున్నారు. ఒకవేళ ఏ కార ణం చేతనైనా ఇవ్వకపోతే మాత్రం తానున్న విశాఖ ఉత్తరం శాసనసభ సీటు నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని కోరుతున్నారని అంటున్నారు. మరి సబ్బం హరి మనసు ఈ వైపు ఉంటే ఆయన్ని భీమిలీ ఇంచార్జిని చేసి పార్టీని అక్కడ పడకేయించారు అని తమ్ముళ్ళే ఆరోపిస్తున్నారు. భీమిలీ ఒకనాడు టీడీపీకి కంచుకోట. ఇపుడు మంత్రి అవంతి శ్రీనివాస్ తన కంచుకోటగా మార్చుకుంటు న్నారు. వైసీపీకి గట్టి సీటుగా కూడా తయారుచేస్తున్నారు.

కచ్చితంగా గెలిచే సీటు భీమిలీని సబ్బం హరి వదిలేశారు. అలా వదిలేసి ఉత్తరాంధ్రాలో టీడీపీ పుంజుకుంటుంది అని అధినాయకత్వం ఎలా భావిస్తుంది అని అంతా అశ్చర్యపోతున్నారు. ముందు మార్పు అన్నది భీమిలీ నుంచి మొదలుపెట్టాలని, అలాగే పూర్తిగా ప్రక్షాళన చేయాలని కూడా కోరుతున్నారు. భీమిలీలో పెద్ద సంఖ్యలో కాపు సామాజిక వర్గం ఉంది. అవంతి కానీ గంటా శ్రీనివాస్ కానీ వారి మద్దతుతోనే వరసగా ఎమ్మెల్యేలుగా గెలిచారు అంటున్నారు. ఇక రాజుల ప్రాబల్యం కూడా బాగా ఉన్న సీటు ఇది. ఈ రెండు బలమైన సామాజిక వర్గాల నుంచి ఎవరో ఒక నేతకు ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగిస్తే భీమిలీలో టీడీపీ బాగుపడు తుంది అంటున్నారు. మరి చంద్రబాబు ఆ దిశగా ఆలోచన చేస్తారా. లేక హరి కధలు వింటూ కాలక్షేపం చేస్తారా అని తమ్ముళ్ళే అడుగుతున్న సీన్ ఉందిపుడు.

# మహిళా ఎమ్మెల్యే..దందా

**తిరుపతి, డిసెంబర్ 18, (ప్రజాపాలన) :** రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ కీలక నియోజకవర్గం రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. సుదీర్ఘ కాలంగా టీడీపీ నేతలు చక్రం తిప్పిన ఈ నియోజకవర్గంలో గత ఏడాది వైసీపీ తరపున విజయం దక్కించుకున్నారు ఓ మహిళా నాయ కురాలు. ఆమెపై చాలా అంచనా లు.. ఆశలతో వైసీపీ అధినేత జగన్ టికెట్ ఇచ్చారు. అంతేకాదు.. తాను ఇవ్వాలని అనుకున్న విషయాన్ని కూడా జగన్ బహిరంగంగా వెల్లడించి.. మాట తప్పకుండా టికెట్ ఇచ్చా రు. ఎన్నికలకు కొన్నాళ్లకు ముందు.. రాజకీయ కక్షల నేపథ్యంలో సదరు మహిళా నేత కుటుంబ పెద్దను కోల్పోయారు. దీంతో ఆ కుటుంబాన్ని రాజకీయంగా ఆదుకోవాలని నిర్ణయించుకున్న జగన్.. టికెట్ ఇచ్చారు. అయితే.. కేవలం ఆ కుటుంబాన్ని ఆదుకోవడమే కాదు.. ఇలా టికెట్ ఇవ్వడం వెనుక.. సదరు నియోజకవర్గంలో మూడు దశాబ్దాలుగా పునాదులు వేసుకున్న టీడీపీకి చెక్ పెట్టేలా వ్యవహరించడంతో పాటు.. వైసీపీ పునాదులను బలపరుస్తారనే దూరదృష్టితో సదరు మహిళా నేతకు అవకాశం కల్పించారు. ఆమె గెలుపునకు సాయం చేశారు. మొత్తానికి ఆమె విజయం సాధించారు. ఇంకేముంది.. ఇక్కడ టీడీపీకి చెక్ పడుతుందని అందరూ అను కున్నారు. అదే సమయంలో వైసీపీ పుంజుకుంటుందని భావించారు. కొన్నాళ్లు పరిస్థితి బాగున్నా.. తర్వా త మాత్రం పరిస్థితి దారుణంగా తయారైంది. సదరు మహిళా ఎమ్మె ల్యే కుటుంబం ఇక్కడ చక్రం తిప్పడం ప్రారంభించింది. ముఖ్యంగా కుమారుడు, అల్లుడు కూడా తమదే అధికారం అన్నట్టుగా వ్యవహరిస్తు న్నారు. అన్ని కాంట్రాక్టులు, సెటిల్ మెంట్లు, భూ ఆక్రమణల్లోనూ వారి పేరు జోరుగా వినిపిస్తోంది. అదే సమయంలో వైసీపీ నాయకులను పట్టించుకోవడం లేదు. కేడర్‌ను చాలా దూరం పెట్టారు. పార్టీ తర ఫున కార్యక్రమాలు కూడా నిర్వహిం చడం లేదు. సదరు మహిళా నేత ఒంటరిగా ఉన్నప్పుడు ఎన్నో కష్టన ష్టాలకు ఓర్చి మరీ ఆమెను గెలిపించిన వారందరిని ఆమె పుత్రరత్నం, బంధుగణం పక్కన పెట్టేశారు. నియోజకవర్గంలో మండలాలను ఆమె పుత్రరత్నం, బంధువులు వంతుల వారీగా పంచుకుని మరీ దోచుకుంటున్నారన్న విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే ఉన్నాయి. ఈ పరిణామాలతో సదరు మహిళా ఎమ్మెల్యే పేరుకేనని.. అక్కడ మంచి పేరున్న కుటుంబాన్ని అనవసరంగా ఓడించామా ? అని నియోజకవర్గ ప్రజలు వాపోతోన్న పరిస్థితి. అంతే కాదు.. సదరు మహిళా ఎమ్మెల్యే కుమారుడు ఏకంగా ఓ భూవివా దానికి సంబంధించి ప్రభుత్వ అధి కారిని లైన్‌లోకి తెచ్చుకునేందుకు.. తాము చెప్పినట్టు చేసేందుకు ఆయ న కుటుంబాన్ని కూడా కిడ్నాప్ చేయించారు. అంతే కాకుండా కొన్ని ప్రభుత్వ భూములు, పేదల భూముల రికార్డులు ఆన్‌లైన్లో రాత్రికి రాత్రే మారిపోతున్నాయి. ఇది కూడా పెను సంచలనంగా మారింది. అయితే.. ఈ పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్న వైసీపీ నేతలు నోరు మెదిపే సాహసం చేయకపోయినా ఆ మహిళా నేత రాజకీయం వచ్చే ఎన్నికలకు ముందే ముగిసిపోతుందని చెవులు కొరుక్కుంటున్నారు.

# గంటా కోసం వెంటాడుతున్నారు..



**విశాఖపట్టణం, డిసెంబర్ 18, (ప్రజాపాలన) :** రాజకీయాల్లో డిమాండు ఉన్న వారి హవా మామూలుగా ఉండదు. ఇపుడు జనాల కంటే వారిని కదిలించే నాయకుడే ఎక్కువ అయిపోతున్నారు. అందుకే బలమైన నాయకులను చేర్చుకోవడానికి పార్టీలు పోటీ పడుతూంటాయి. విశాఖ వరకూ చూసుకుంటే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పొలిటికల్ జంక్షన్ లో ఉన్నారు. ఆయన టీడీపీని దాదాపుగా వీడినట్లే లెక్క అంటున్నారు. ఆయన చంద్రబాబు తో కూడా ఈ మధ్య సన్నిహితంగా ఉంటున్నట్లుగా ఎక్కడా కనిపించడంలేదు. టీడీపీ ఆఫీస్ గడప తొక్కకుండా అసెంబ్లీ సమావేశాలకు కూడా వెళ్ళకుండా గంటా శ్రీనివాసరావు తన ఎమ్మెల్యే గిరినీ అలా కొనసాగిన్స్తున్నారు. గంటా శ్రీనివాసరావు వైసీపీలోకి వెళ్లాలని చాలా గట్టిగానే ప్రయత్నాలు చేశారు. అయితే మొదట్లో జగన్ ఓకే చేసినా ఆ తరువాత విశాఖ వైసీపీ నేతల అభ్యంతరాలు, గంటా అనుచరుల భూ కబ్జాల కధలతో వెనక్కి తగ్గారని అంటారు. ఇక గంటా కూడా వైసీపీలోకి వెళ్ళేందుకు తుది విడత ప్రయత్నాలు చేస్తున్నాట్లుగా తాజా టాక్. తన వంతుగా ఆయన వైసీపీ వైపు నుంచి పిలుపు వచ్చేలా చేసు కుంటున్నారు అంటున్నారు. ఒక వేళ అది కుదరకపోతే అపుడు బోల్డ్ డెసిషన్ తీసుకుంటారు అంటున్నారు. గంటా శ్రీనివాసరావుకు ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు మంచి సంబంధాలు ఉన్నాయి. ఇద్దరూ ఒకే సామాజికవర్గం నేతలు కావడమే కాదు, ఇద్దరికీ మెగా ఫ్యామిలీతో మంచి రిలేషన్స్ ఉన్నాయి. దాంతో ఈ ఇద్దరు నేతలూ మనసు విప్పి అన్ని విషయాలు మాట్లాడుకుంటారన్నది తెలిసిందే. గంటా శ్రీనివాసరావును ఎలాగైనా బీజేపీలోకి తెచ్చి ఉత్తరాంధ్రా బాధ్యతలు ఆయన చేతిలో పెట్టాలని సోము భావిస్తున్నారుట. గంటాకు ఉన్న బలం, బలగం కనుక బీజేపీలో చేరితే ఇక మూడు జిల్లాల్లో చూసుకోనవసరం లేదని సోము వీర్రాజు దృఢమైన అభిప్రాయం. గంటా శ్రీనివాసరావు బీజేపీలోకి వస్తే ఆయనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారని హామీలు కూడా వస్తున్నాయట. కేంద్ర మంత్రి పదవి ఆఫర్ ని కూడా గంటాకు చేస్తున్నట్లు భోగట్టా. బలమైన కాపు సామాజికవర్గానికి చెందిన గంటా ఓటమెరుగని నేతగా పేరు పొందారు. దాంతో ఆయన కనుక వస్తే కాంగ్రెన్, టీడీపీలలో ఆయనతో ఉన్న సన్నిహితులు కూడా కాషాయం కడతారు అని అంటున్నారు. మొత్తానికి గంటా బీజేపీకి నో చెప్పకపోవడం ఇపుడు హాట్ టాపిక్ గా ఉంది. గంటాను వైసీపీలోకి తీసుకురావాలని ఉత్తరాంధ్రాకు చెందిన ఓ సీనియర్ మంత్రి గట్టిగా ప్రయత్నాలు చేస్తూండడంతో గంటా బీజేపీని ఆగమంటున్నట్లుగా చెబుతున్నారు. మరి ఆ మంత్రి మాటకు జగన్ విలువ ఇస్తే గంటా వైసీపీలోకి వస్తారు. లేకపోతే మాత్రం జై బీజేపీ, జై మోడీ అనేస్తారని లేటెస్ట్ టాక్

# గోదావరి నదిలో పెద్ద ఎత్తున అక్రమాలు



**రాజమండ్రి, డిసెంబర్ 18 (ప్రజాపాలన) :** పూడికతీత ముసుగులో గోదావరి నదిలో పెద్దఎత్తున అక్రమాలకు తెరతీశారు. నదిపై వంతెనలకు సమీపంలో ప్రమాదభరితంగా పొక్లయినర్లతో ఇసుకను తవ్వేస్తున్నారు. 20-30 మీటర్ల లోతున ఇసుక తవ్వేస్తూ నదీ గర్భంలో అగాధాలను సృష్టిస్తున్నారు. నిబంధనలకు పాతర వేసి, నదికి తూట్లు పొడిచే ప్రక్రియ రాజకీయ పలుకుబడితో సాగిపోతోందని ఆరోపణలు విన్పిస్తున్నాయి. అఖండ గోదావరి నది ధవళేశ్వరం కాటన్ బ్యారేజికి ఎగువన రాజమహేంద్రవరం మండలం కాతేరు గ్రామం వద్ద ఎడమ గట్టును ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా పొక్లైనర్లతో ఇసుకను యధేచ్ఛగా తవ్వేస్తున్నారు. దాదాపు రెండు నెలలుగా ఈ ప్రాంతంలో పొక్లయిన్లతో ఇసుకను తవ్వుతున్నట్టు స్థానిక రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండు రోజుల క్రితం సబ్-కలెక్టర్ వచ్చి పరిశీలించారు. అయినా మళ్ళీ యథేచ్ఛగా ఇసుక అక్రమంగా తవ్వేస్తున్నారు. సోమవారం ఉదయం ప్రాంతంలో పొక్లయిన్లతో చాగల్నాడు పంపింగ్ స్కీము వద్ద భారీ స్థాయిలో ఇసుక తవ్వకా లు చేపట్టారు. ఏపీఎండీసీ అధికా రులు గానీ, రెవెన్యూ అధికారులు గానీ, ఇరిగేషన్ అధికారులు గానీ ఆ ప్రాంతంలో ఎవరూ కన్పించకుం డా జాగ్రత్త పడుతూ ఇసుక తవ్వ కాలు పొక్లయిన్లతో తవ్వేస్తున్నారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి వాస్తవానికి రబీ సీజన్ లో నీటి విడుదలకు అనుమతి లేదు. కానీ మంచినీటి అవసరాల నిమిత్తం చెరువులను నింపుకోవడానికి చాగల్నాడు ఎత్తిపోతల పథకం నుంచి ఒక పంపును ఆన్‌చేసి 165 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఈ నీటిని విడుదల చేసేందుకు చాగల్నాడు ఎత్తిపోతల పథకానికి సంబంధించి నదీ గర్భం లో గట్టుకు లోపలి భాగంలో వుండే ఇన్‌టేక్‌వెల్‌కు అడ్డుగావున్న ఇసుక మేటలను తొలగించే పేరుతో పూడి కతీత పనులు చేపట్టి ఆ పనుల ముసుగులో పొక్లయిన్లతో ఇసుకను తవ్వేస్తున్నారు. ఏపి మైనింగ్ శాఖ జాబితాలో కాతేరు గ్రామంలో డీసిల్టే షన్ ర్యాంపు ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించారు. ఈ మేరకు డీ సిల్టేషన్ ర్యాంపులో యంత్రాలతో పనులు చేయించడానికి వీల్లేదు. కానీ ఇక్కడ డీసిల్టేషన్ ర్యాంపులో రాజకీయ పలుకుబడితో పొక్లయిన్ల తో విచ్చల విడిగా ఇసుకను రోజు వందలాది లారీల చొప్పున భారీ టిప్పర్లతో తరలిస్తున్నారు. వాహనాలకు జీపీఎస్‌లు లేకుండా, ఎక్కడికి పోతోందో కూడా తెలియని విధంగా పర్యవేక్షణ కూడా లేకుం డా ఈ ఇక్కడ నుంచి నిత్యం పగ లూ రాత్రీ తేడా లేకుండా భారీ టిప్ప ర్లు ఇసుక రవాణా చేస్తున్నాయి. పంటలకు నీరు అవసరం లేకపోయినా ఎత్తిపోతల పథకాన్ని ఆన్‌చేసి నీటిని వినియోగిస్తూ, ఇసుక తరలించడానికి వీలుగా పూడికతీత పనులను అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున రాజకీయ పలుకుబడితో అధికార యంత్రాంగం ఇక్కడ గూడు పుఠాణీ చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా నిత్యం వందలాది లారీ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై స్థానిక ఇరిగేషన్ జేఈని ప్రశ్నించగా నాలుగైదు రోజుల నుంచే చాగల్నాడు పంపింగ్ స్కీమ్ నుంచి మంచినీటి అవసరాల నిమి త్తం నీటిని విడుదల చేస్తున్నామ న్నారు. ఇసుకతీతకు తమకు ఎటు వంటి సంబంధం లేదని, పూర్తిగా ఏపీఎండిసీ పర్యవేక్షణలోనే జరుగుతోందని సమాధానం చెప్పారు. ఏదేమైనప్పటికీ ఇక్కడ రూ. కోట్ల విలువైన ఇసుకను దాదాపు రెండు నెలలుగా తరలిస్తున్నట్టుగా తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపిస్తే ఈ వ్యవహారంలో ఎవరెవరు వున్నారో తేలుతుందని స్థానికులు అంటున్నారు. ఇదిలా వుండగా అఖండ గోదావరి నది ఎడమ గట్టు వైపు ఏపీ మైనింగ్ శాఖ కేతావారిలంక డీసిల్టేషన్ గాయత్రి ర్యాంపులో 2 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు 2020 సెప్టెంబర్ వరకు అనుతి వుంది. ఏపీ ఎండిసీ పర్యవేక్షణలో ఇసుక తీసి విక్రయిస్తున్నారు. బ్రిడ్జిలంక కోటిలింగాల ర్యాంపులో 2 లక్షల క్యూబిక్ మీటర్లు, వెంకటనగరం డీ సిల్టేషన్ ర్యాంపులో 2 లక్షల క్యూబిక్ మీటర్లు, వెంకటనగరం డీ సిల్టేషన్ కాతేరు గ్రామం వద్ద చాగల్నాడు ఎత్తిపోతల పథకం వద్ద కేవలం 30వేల క్యూబిక్ మీటర్ల ఇసుకను 2020 అక్టోబర్ 28వ తేదీ వరకు తీసేందుకు అనుమతి వుంది. కానీ ఇక్కడ దాదాపు రెండు నెలల నుంచి యంత్రాలను వినియోగించి ఇసుక తీస్తున్నారంటే లక్షలాది క్యూబిక్ మీటర్లు తీసినట్టేనని, కానీ అధికారుల లెక్కల్లో మాత్రం కేవలం 30వేల క్యూబిక్ మీటర్లకే అనుమతి వుంది. సీతానగరం మండలం కాటవరంలో డీ సిల్టేషన్ ర్యాంపులో 1.62 వేల క్యూబిక్ మీటర్లకు, కాటవరం ములకల్లంక డీసిల్టేషన్ ర్యాంపులో 1,05,294 క్యూబిక్ మీటర్ల ఇసుక తీసేందుకు అనుమతి వుంది. నిర్దేశిత డీసిల్టేషన్ ర్యాంపుల్లో నిర్ణయించిన లోతును మించి ఇసుక తొలగించినా పర్యవేక్షించే యంత్రాంగం లేదని తెలుస్తోంది.

# సినిమాస్కోప్

## సినీ పరిశ్రమలో నాకు చాలా మంది వ్యతిరేకులున్నారు



ఉద్దేశపూర్వకంగా వారు వివాదాల్లోకి వెళ్తారా..? వివాదాలే వాళ్లను వెంటాడుతాయా..? అన్నట్టుగా ఉంటారు కొందరు సెలెబ్రిటీలు. ఇలాంటి వారిలో ఒకరు బాలీవుడ్ హీరోయిన్ కంగనా రనౌత్. తన ప్రకటనలతో వివాదాస్పదం అవుతూ నిత్యం వార్తల్లో ఉంటుంది. సుశాంత్ సింగ్ మరణం అంశం.. తర్వాత మహారాష్ట్ర సర్కారుతో వైరం.. తాజాగా రైతుల ఉద్యమానికి వ్యతిరేకంగా కామెంట్లు.. ఇలా తరచూ భిన్నమైన వ్యాఖ్యలు చేస్తూ వివాదాలకు కేంద్ర బిందువు అవుతోంది కంగనా రనౌత్. ఈ విషయ మై తాజాగా ఓ ప్రకటన చేసింది.

**నేను నిజాయితీగా ఉంటా..**
చిత్రపరిశ్రమ గురించి కావొచ్చు.. ఇతర విషయాల గురించి కావొచ్చు తాను నిజాయితీగానే మాట్లాడతానని చెబుతోంది రనౌత్. “నేను రిజర్వేషన్లను వ్యతిరేకించాను.. చాలా మంది హిందువులు తిట్టారు. నేను ఇస్లాం వాదులను వ్యతిరేకిస్తాను.. అందుకే ముస్లింలు నన్ను ద్వేషిస్తారు. నేను ఖలిస్తానీలతో పోరాడాను.. కాబట్టి ఇప్పుడు సిక్కులు నాకు వ్యతిరేకంగా మారారు. అసలు నేనేం చేస్తున్నాను.. ఎందుకు చేస్తున్నాను అని చాలా మంది ఆలోచిస్తుంటారు. కానీ.. ఈ ప్రపంచాన్ని మించిన నా ప్రపంచంలో నా మనస్సాక్షి నన్ను ఎప్పుడూ ప్రశంసిస్తూనే ఉంటుంది” అని వ్యాఖ్యానించింది.

**‘తలైవి’ ముగింపులో..:** కంగనా నటిస్తున్న తాజా మూవీ ‘తలైవి’ షూటింగ్ ఇటీవల పూర్తయింది. ఈ సందర్భంగా భావోద్వేగ ప్రకటన ఒకటి చేసిందీనటి. “జయలలిత వంటి నాయకురాలి పాత్రలో నటించడం జీవిత కాల అవకాశంగా భావిస్తున్నా. ఈ చిత్రీకరణ త్వరగా ముగియడం బాధగా ఉంద”ని చెప్పింది. ఈ సినిమాలో జయలలిత పాత్రలో కంగనా నటిస్తుండగా.. ఎంజీఆర్ గా అరవింద్ స్వామి కరుణానిధిగా ప్రకాష్ కనిపించనున్నారు. విజయ్ దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రం అనంతరం నటించే మూవీలో కంగనా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ పైలెట్ గా కనిపించనున్నారు.

## ‘ఎఫ్ 3’ మూవీ.. మొదలు కాకుండానే అమ్మేశారు!




ఒక సినిమా షూటింగ్ పూర్తయి.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు అయ్యాక.. థియేటర్ రైట్స్ శాటిలైట్ హక్కుల వ్యవహారం డిస్కషన్లో ఉంటుంది. కానీ.. దిల్ రాజు నిర్మిస్తున్న ‘ఎఫ్ 3’ మూవీ మాత్రం.. షూటింగ్ షురూ కాకముందే అమ్మకాలు జరిగిపోయాయట! సూపర్ హిట్ చిత్రం ‘ఎఫ్ 2’ తర్వాత.. అవే పాత్రలతో అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం ‘ఎఫ్ 3’. ఈ చిత్ర ప్రారంభోత్సవం గురువారం జరిగింది.

**సీక్వెల్ కాదంటున్న అనిల్..**
‘ఎఫ్ 3’ మూవీ.. ‘ఎఫ్ 2’కు సీక్వెల్ కాదంటున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి. గతేడాది జనవరిలో విడుదలైన ‘ఎఫ్ 2’ భార్యాభర్తల రిలేషన్ మీద ఫోకస్ అయిన కథ. అయితే.. ఇప్పుడు రూపొందిస్తున్న ‘ఎఫ్ 3’ మాత్రం.. డబ్బు చుట్టూ తిరుగుతుందని అందువల్ల రెండు సినిమాలు సంబంధం లేదని చెబుతున్నాడు దర్శకుడు.

**మంచి ధరలకే అమ్మేశారట..**
‘ఎఫ్ 3’ చిత్రం డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ మంచి ధర చెల్లించి సొంతం చేసుకుందట. అలాగే శాటిలైట్ హక్కులను కూడా ఒక లీడింగ్ టీవీ ఛానెల్ సొంతం చేసుకున్నట్టు తెలు స్తోంది. ‘ఎఫ్ 2’ భారీ విజయంతో రాబోయే ‘ఎఫ్ 3’పై మాంచి క్రేజ్ ఏర్పడింది. అందుకే ప్రేక్షకులతో పాటు బిజినెస్ వర్గాల్లోనూ ఈ సిని మాకు డిమాండ్ ఏర్పడింది. అందు వల్లే.. సినిమా మొదలుకావడానికి ముందే సగం బిజినెస్ అయిపోయి నట్టు సమాచారం. ఇందులో విక్టరీ వెంకటేష్ వరుణ్ తేజ్ తమన్నా మెహ్రీన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న సంగతి తెలిసిందే.

## రికార్డులు తిరగరాసిన ఎన్టీఆర్ భీం టీజర్



సరైన కథ పడితే యంగ్ టైగర్ ఎన్టీఆర్ నట విశ్వరూపం ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఇందుకోసం ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న జూనియర్ కి రాజమౌళి జత కావడంతో అభిమానుల అంచనాలు ఆకాశాన్నంటాయి. వారి ఆశలను ఏ మాత్రం డిసప్పాయింట్ చేయం అన్నట్టుగా విడుదలైంది ‘ఆర్ఆర్ఆర్’ టీజర్. ఈ భారీ పీరియాడిక్ చిత్రంలో కొమరం భీం గా నటిస్తున్న తారక్ నుంచి వచ్చిన టీజర్ రికార్డులను తిరగరాస్తోంది. తెలుగులో కనీవినీ ఎరుగని రీతిలో వ్యూస్ వచ్చాయి. టీజర్ రిలీజైన దగ్గర్నుంచి గ్రాఫ్ అంతకంతకూ పెరుగుతూ వెళ్లింది. కేవలం వ్యూస్ విషయంలోనే కాకుండా లైక్స్ కామెంట్స్ విభాగంలోనూ ‘నెవర్ బిఫోర్’ అంటూ రికార్డులు నెలకొల్పి సంచనలనం సృష్టించింది. ఈ టీజర్ కు ఐదు లక్షల పైచిలుకు కామెంట్లు వచ్చాయి. దీంతో తారక్ స్టామినా మరోసారి రుజువైంది.

## మెగా ‘ఉప్పెన’ ఓటీటీ రిలీజ్ పై ఫుల్ క్లారిటీ




మెగా ఫ్యామిలీ నుండి హీరోగా పరిచయం కాబోతున్న వైష్ణవ్ తేజ్ మొదటి సినిమా ఉప్పెన ఈ ఏడాది ఆరంభంలోనే విడుదల కావాల్సి ఉన్నా కూడా కరోనా కారణంగా నిలిచి పోయిన విషయం తెల్సిందే. సమ్మర్ నుండే ఉప్పెన సినిమాను ఓటీటీ ద్వారా విడుదల చేస్తారనే వార్తలు వస్తున్నాయి. వైష్ణవ్ తేజ్ మొదటి సినిమా అవ్వడం వల్ల ఓటీటీ విడుదలకు మెగా ఫ్యామిలీ నో అన్నట్లుగా తెలుస్తోంది. నిర్మాతలు సైతం పెద్దగా ఆర్థికపరమైన ఇబ్బందులు లేకపోవడంతో మెల్లగా థియేటర్లలోనే విడుదల చేయాలని భావిస్తున్నట్లుగా వార్తలు వచ్చాయి. కాని అప్పుడప్పుడు ఓటీటీ రిలీజ్ గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ఉప్పెన విడుదలపై ఎట్టకేలకు క్లారిటీ వచ్చింది. ఈ సినిమాను ఎంత ఆలస్యం అయినా కూడా థియేటర్లలోనే విడుదల చేయబోతున్నారు. ఇప్పటికే ఓటీటీ రైట్స్ ను నెట్ ఫ్లిక్స్ కు అమ్మేయడం జరిగింది. భారీ మొత్తానికి నెట్ ఫ్లిక్స్ వారు ఉప్పెన కొనుగోలు చేసినప్పటిని సినిమా థియేటర్ రిలీజ్ అయిన 50 రోజుల తర్వాతే స్ట్రీమింగ్ చేయాల్సి ఉంటుందని నిర్మాతలు ఒప్పందం చేసుకున్నారట. ఉప్పెన సినిమా ఓటీటీ డైరెక్ట్ రిలీజ్ లేదని ఈ ఒప్పందంతో క్లారిటీ వచ్చేసింది. అయితే వైష్ణవ్ తేజ్ రెండవ సినిమాను మాత్రం ఓటీటీ డైరెక్ట్ రిలీజ్ చేయబోతున్నారని విశ్వసనీయ సమాచారం అందుతోంది. క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు కొండపొలం అనే టైటిల్ అనుకుంటున్నారట. రకుల్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతుంది. ఉప్పెన తర్వాత ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

## చిరుతో నటించే ఆసక్తి లేదన్న రాములమ్మ!



లేడీ సూపర్ స్టార్ గా.. లేడీ అమితాబ్ గా పేరు దక్కించుకున్న విజయశాంతి సినిమాలకు దూరం అయ్యి పూర్తి రాజకీయాల్లో మునిగి పోయారు. ఆమె మళ్లీ సినిమాలు చేయరేమో అనుకుంటూ ఉండగా అనూహ్యంగా సరిలేరు నీకెవ్వరు సినిమాలో కీలక పాత్రలో కనిపించారు. ఆ సినిమా ప్రీ రిలీజ్ సమయంలో చిరంజీవితో ఉన్న విభేదాలు అన్ని పక్కకు పెట్టి మేమిద్దరం మంచి స్నేహితులం అంటూ తేల్చి చెప్పింది. ఇండస్ట్రీలో నాకు మంచి మిత్రుడు చిరంజీవి అంటూ చాలా మాట్లాడారు. ఆ రోజు చిరంజీవి మరియు విజయశాంతిలను అలా చూసి 1980 సినిమాల ప్రేమికులు ఆనందించారు. వీరిద్దరు మళ్లీ కలిసి నటిస్తే ఎంత బాగుంటుంది అనుకున్నారు. విజయశాంతి ఆ సమయంలో మంచి పాత్రలు వస్తే నటిగా కంటిన్యూ అవుతాను అన్నారు. కట్ చేస్తే విజయశాంతి కాంగ్రెస్ నుండి బీజేపీలోకి వెళ్లారు. ఆ సందర్భంగా ఒక ప్రముఖ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో సినిమాలపై క్లారిటీ ఇచ్చింది. సినిమాల్లో కంటిన్యూ అవ్వాలని భావించినప్పటికి రాజకీయంగా బిజీగా ఉండటం వల్ల కుదరడం లేదంది. చిరంజీవి గారితో నటించే అవకాశం ఉందా అంటూ ప్రశ్నించిన సమయంలో చిరుతో నటించే ఆసక్తి లేదని రాములమ్మ విజయశాంతి పేర్కొన్నారు. చిరంజీవితోనే కాకుండా ఏ స్టార్ హీరో సినిమాలో కూడా ప్రస్తుతానికి నటించాలని లేదని పేర్కొంది. తెలంగాణలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామంటూ ఆమె పేర్కొన్నారు. సినిమాల గురించి ఆలోచించే సమయం లేదని కూడా ఆమె అన్నారు.

## షాదీకి రెడీ అవుతున్న ‘మొగలిరేకులు’ ఆర్కే నాయుడు



ఆర్కే నాయుడు అనే పేరు వినగానే ‘మొగలి రేకులు సీరియల్ గుర్తొస్తుంది. అంతగా ఆ సీరియల్లో ఆ పాత్ర పాపులర్ అయింది. పోలీస్ ఆఫీసర్ ఆర్కే నాయుడు పాత్ర ద్వారా బుల్లితెర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ఆ నటుడి పేరే ‘సాగర్’. ‘చక్రవాకం’ సీరియల్ ద్వారా మంచి క్రేజ్ తెచ్చుకున్న సాగర్ ఆ తరువాత ‘మొగలిరేకులు’ సీరియల్ ద్వారా ఆ క్రేజ్ ను చాలాకాలం పాటు కొనసాగించాడు. ఇప్పటికీ ఆయనను ఆర్కే నాయుడుగానే ప్రేక్షకులు గుర్తిస్తారు. బుల్లితెరపై స్టార్ డమ్ ను సంపాదించుకున్న చాలామంది వెండితెర దిశగా అడుగులు వేశారు. సాగర్ కూడా అదే రూట్లో ముందుకువెళ్లాడు. సాగర్ మంచి పొడగరి .. అందుకు తగిన పర్సనాలిటీతో ఆకర్షణీయంగా కనిపిస్తాడు. బుల్లితెరపై అతణ్ణి చూసినప్పుడే అతనిలో ఒక మాస్ హీరోకు కావలసిన లక్షణాలన్నీ పుష్కలంగా ఉన్నాయని చెప్పుకున్నారు. దాంతో సాగర్ ఆ దిశగానే తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. హీరోలకి స్నేహితుడిగా ఒకటి రెండు సినిమాల్లో కనిపించిన సాగర్ ఆ తరువాత హీరోగానే ఎంట్రీ ఇచ్చాడు. ఆయన హీరోగా చేసిన ‘సిద్ధార్థ’ కొంతకాలం క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే సరైన పబ్లిసిటీ లేని కారణంగా ఆ సినిమా అంతగా ఆడలేదు. ఆ తరువాత మంచి కథ కోసం వెయిట్ చేసిన సాగర్ ‘షాదీ ముబారక్’ సినిమా ద్వారా త్వరలో ప్రేక్షకులను పలకరించనున్నాడు. ‘దిల్’ రాజు ప్రొడక్షన్ హౌస్ నుంచి రానున్న ఈ సినిమా ద్వారా ‘పద్మశ్రీ’ అనే యువకుడు దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ సినిమా ద్వారా ‘దృశ్య రఘునాథ్’ అనే కొత్తమ్మాయి హీరోయిన్ గా తెలుగు తెరకి పరిచయమవుతోంది. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా నిర్మితమైన ఈ సినిమా నుంచి మరో నాలుగైదు రోజుల్లో ఫస్టు టీజర్ ను రిలీజ్ చేయనున్నారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నాయి. పూర్తి వినోదభరితంగా రూపొందిన ఈ సినిమా అన్ని వర్గాలవారికి బాగా నచ్చుతుందనీ తన కెరియర్ కి ఎంతో హెల్ప్ అవుతుందని సాగర్ భావిస్తున్నాడు. తాను ఇంతకాలంగా ఎదురుచూస్తున్న సక్సెస్ ఈ సినిమాతో పడుతుందని ఆయన నమ్ముతున్నాడు. న్యూ ఇయర్ ఆ ముచ్చట తీరుస్తుందేమో చూడాలి మరి.

## మాస్టర్’ టీజర్.. విజయ్ తెలుగులోనూ దుమ్ము



తమిళ సూపర్ స్టార్ విజయ్ టాలీవుడ్ లో ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో స్టార్ డం దక్కించుకోలేక పోయాడు. తమిళంలో మంచి మార్కెట్ ఉన్న విజయ్ కి తెలుగులో సూర్య రేంజ్ కనీసం కార్తీ రేంజ్ మార్కెట్ ఉన్నా కూడా సౌత్ ఇండియాలో ఆయన్ను కొట్టే హీరోనే ఉండడు అనడంలో సందేహం లేదు. కాని టాలీవుడ్ లో ఆయన సినిమాలు ఎక్కువ శాతం నిరాశ పర్చుతూనే ఉన్నాయి. ఇలాంటి సమయంలో మాస్టర్‌తో తెలుగులో సూపర్ హిట్ ను కొట్టేందుకు సిద్ధం అవుతున్నాడు. తమిళ ఖైదీ ని తెరకెక్కించిన లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన ‘మాస్టర్’ సినిమా విడుదలకు సిద్ధంగా ఉంది. కరోనా కారణంగా నిలిచి పోయిన మాస్టర్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఆరంభం లోనే విడుదల చేసేలా ఉన్నారు. అందుకే టీజర్ ను వది లారు. ఇటీవలే మాస్టర్ తమిళ టీజర్ వచ్చింది. ఇప్పుడు తెలుగు టీజర్ సందడి చేస్తోంది. సన్ పిక్చర్స్ బ్యానర్‌లో రూపొందిన ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అంచనాలకు తగ్గట్లుగా ఉంటుందని ఈ సినిమా టీజర్ చెప్పకనే చెబుతోంది. తమిళంలో ఎలాగూ ఈ సినిమా సూపర్ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. ఇలాంటి సమయంలో తెలుగు టీజర్ కూడా జనాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తెలుగులో విజయ్ ఈ సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకుంటాడనే నమ్మకం వ్యక్తం అవుతుంది. లోకేష్ ఖైదీ సినిమా తెలుగులో ఆకట్టుకుంది. మరోసారి ఈ సినిమాతో కూడా ఆయన ఆకట్టుకుని విజయ్ కి తెలుగులో మొదటి విజయాన్ని ఇస్తాడేమో చూడాలి.

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed at Unyted Publications from H.no.# 5+-61-3,Rajendra Nagar,Seethampeta,Visakhapatnam-16,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16, Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com